ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :116 నల్గొండ | గురువారం 24-07-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 | వెల : రూ.1/-

**విలేఖరులు కావలెను**

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

## అప్పుడు ఆర్టీసీ ఉంటుందా అనుకునే పరిస్థితి..



హైదరాబాద్, గత 10 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను నిర్వీర్యం చేశారని, ఓ సమయంలో ఆర్టీసీ ఉంటుందా?అని కూడా అనుకునే పరిస్థితి ఉండేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వస్తుందని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పైసలు వాడుకున్న పరిస్థితి ఉండేదని, ఇప్పుడు వారికి డబ్బులు చెల్లిస్తున్నాం అని చెప్పారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు బస్సులకు యజమానులకు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసిందన్నారు. ఆర్టీసీకి ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా ఉంటుందని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. 200 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ఆర్టీసీ వేడుకలు నిర్వహించింది. ఈ వేడుకలకు మంత్రి పొన్నం హాజరై మాట్లాడారు.'200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణం పూర్తయిన సందర్భంగా అందరికి శుభాకాంక్షలు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన 2023 డిసెంబర్ 9న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా శాసన సభ వేదిక మహాలక్ష్మి పథకం ప్రారంభించుకున్నాం. ఇప్పటివరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్నాం. ఈ పథకం విజయవంతం కావడానికి కృషి చేసిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు అభినందనలు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగా వెళ్తున్నారు. ఉద్యోగాలు, షాపింగ్, దేవాలయాలు%ొ% ఎక్కడికి వెళ్లాల న్నా ఉచిత ప్రయాణం ఉపయోగించుకుంటున్నారు. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీని నిర్వీర్యం చేశారు. ఆర్టీసీ ఉంటుందా అని కూడా అనుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆర్టీసీ నష్టాల నుండి లాభాల్లోకి వస్తుంది. కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నాం, నియామకాలు చేస్తున్నాం. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పైసలు వాడుకున్న పరిస్థితి, ఇప్పుడు వారి డబ్బులు చెల్లిస్తున్నాం' అని మంత్రి పొన్నం తెలిపారు.'సంస్థ పరిరక్షణ ప్రయాణికుల సౌకర్యం ఉద్యోగుల సంక్షేమం నినాదంతో ఆర్టీసీ ముందుకు పోతుంది.ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు బస్సులకు యజమానులకు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసింది. ఇటీవల 150 బస్సులకి కోటి రూపా యల చెక్కులు కూడా అందజేసాము. గతంలో 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. 60 శాతం ఉన్న ఆక్యుపెన్సీ ఇప్పుడు 97 శాతంకి పెరిగింది. ఆర్థిక విధ్వంసం తరువాత ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఆర్టీసీకి ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా ఉంటుంది. ఈరోజు 97 బస్సు డిపోలు, 324 బస్ స్టేషన్లలో 200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు 6680 కోట్ల రూపాయల విలువైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు నిర్వహిస్తున్నాం' అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

## మహిళలు రూ.6680 కోట్లు ఆదా చేసుకున్నారు.. అందరికీ శుభాకాంక్షలు!

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ ఆర్టీసీ) 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ.6680 కోట్ల రూపాయలు ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో మహాలక్ష్మి సంబరాలు చేస్తోంది.ఉచిత బస్సు ప్రయాణాల వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హాజరయ్యారు. ఆర్టీసీ వేడుకలలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు.'200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ పండగ కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9న ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. 200 కోట్ల ఉచిత మహిళా ప్రయాణికులు 6680 కోట్లు ఆదా చేసుకున్నారు వారికి శుభాకాంక్షలు. మునిగిపోతున్న పడవ ఎందుకు ఎక్కుతారని ఆరోజు అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తరువాత ఇప్పుడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చింది. మునిగిపోతున్న పడవ కాదు లాభాల్లోకి వస్తున్న ప్రభుత్వ సంస్థ. 200 కోట్ల మహిళా ప్రయాణికుల చార్జీలను 6680 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించింది. భవిష్యత్తులో కూడా మీ చార్జీలను ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. వచ్చిన ఆదాయం ద్వారా కొత్త బస్సులు కొనుగోలు చేసే స్థాయికి ఆర్టీసీ ఎదిగింది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 2400 కొత్త బస్సులు కొనుగోలు చేసింది' అని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు.ఆర్టీసీపై రవాణా శాఖ మంత్రి కొత్త విధానాలు ప్రవేశపెట్టారు. ఒకప్పుడు ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం ఉంటే.. ఇప్పుడు 97 శాతంకి పెరిగింది. మహాలక్ష్మికి ముందు 45 లక్షల మంది ప్రయాణం చేస్తే.. ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యం పెరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలోచన చేశారు. కాలుష్య రహిత నగరంగా మార్చడానికి నగరంలో ఉన్న 2800 బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్



బస్సులు తీసుకురావాలని ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. ఇప్పుడు ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. ఇప్పటికే 3000 ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్డర్ ఇచ్చారు. ఇప్పటికే 11 శాతం ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి, దానిని పెంచుకుంటూ పోతున్నారు. మహాలక్ష్మి పథకం విరివిగా ఉపయోగించి 200 కోట్ల ప్రయాణాలు పూర్తి చేసుకొని మీరు అనేక ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకున్నారు, నగరాల్లో పనికి ఉపయోగించుకున్నారు, అవసరాల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్ళారు. మీరు 6680 కోట్ల రూపాయలు మీ కుటుంబాలకు అదా చేసుకున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది. ఆర్టీసీలో కేవలం ప్రయాణమే కాదు.. ఆర్టీసీ బస్సులకు యాజమానులను చేశాం. వడ్డీలేని రుణాలు ద్వారా బస్సులు కొనుగోలు చేయించారు. 150 మహిళా సంఘాల ఆర్టీసీ బస్సు యజమానులకు కోటి రూపాయల చెక్కులు ఇటీవలే అందించాం. ఇప్పటికే 25 వేల కోట్ల వడ్డీలేని రుణాలు మహిళలకు అందించాం. ఈ 5 ఏళ్లలో లక్ష కోట్లు మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తాము. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కోట్ల రూపాయలతో రోడ్ల మరమత్తులు ,అభివృద్ధి చేయడానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నారు. దీని ద్వారా రవాణా మరింత అభివృద్ధి చెందుతుంది' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

## మసీదులో అఖిలేష్ యాదవ్ మీటింగ్..డింపుల్ యాదవ్ దుస్తులపై వివాదం..

లక్నో:ఓ మసీదులో సమాజ్ వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత ములాయం సింగ్ యాదవ్, ఆయన భార్య డింపుల్ యాదవ్‌లు సందర్శించడం వివాదాస్పదంగా మారింది. బీజేపీ ఇద్దరు నేతలపై విరుచుకుపడుతోంది.ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఇటీవల పార్లమెంట్ సమీపంలోని ఒక మసీదును సంరద్శించారు. మతపరమైన ప్రాంతంలో రాజకీయా సమావేశాలు నిర్వహించడం ఏమిటని బీజేపీ ప్రశ్నిస్తోంది. ఈ సమావేశంలో డింపుల్ యాదవ్ ధరించిన దుస్తులపై కూడా వివాదం చెలరేగింది.బీజేపీ మైనారిటీ మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ ఈ వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు చేశారు. అఖిలేష్ యాదవ్ ప్రార్థనా స్థలాన్ని అనధికారికి ఎస్పీ కార్యాలయంగా మార్చారని దుయ్యబట్టారు. "అఖిలేష్ యాదవ్ నిన్న మసీదుకు వెళ్ళాడు. ఆ మసీదు పార్లమెంట్ భవనం ముందు ఉంది. ఎస్పీ ఎంపీ నద్వీ అక్కడి ఇమామ్. మసీదు లోపల రాజకీయ సమావేశం ఎందుకు జరిగింది?" అని ప్రశ్నించారు. ఫోటోలో డింపుల్ యాదవ్ బ్లౌజ్ ధరించినట్లు కనిపిస్తోందని, ఆమె వీపు, పొట్ట కనిపిస్తోందని, డింపుల్ తలపై దుపట్టా కూడా లేదని అన్నారు. ఇది మసీదు లోపల ప్రవర్తనా నియమావళికి పూర్తిగా విరుద్ధమని, ప్రపంచవ్యాప్తంగా ఇది ఇస్లామిక్ మనోభావాలను దెబ్బతీస్తుందని అన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని చెప్పారు. మసీదును ఎస్పీ నాయకులు సరదాలకు, ఉల్లాసానికి వేదిక మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఈ సమావేశంలో దేశవ్యతిరేక కార్యకలాపాల గురించి చర్చించారని అన్నారు.యూపీ



డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్ కూడా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎస్పీ రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం మతపరమైన ప్రదేశాలను ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. అయిత, బీజేపీ ఆరోపణల్ని ఎస్పీ తీవ్రంగా ఖండించింది. ఈ వివాదం ద్వారా జాతీయ సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు. బీజేపీ రాజకీయ లాభం కోసం మతాన్ని ఆయుధంగా ఉపయోగిస్తోందని అఖిలేష్ ఆరోపించారు. డింపుల్ యాదవ్ తన తలపై దుప్పట్టా కప్పుకున్నారు, ఫోటో తీస్తున్న సమయంలో జార వచ్చు అని ఎస్పీ ఎంపీ జియా ఉర్ రెహ్మాన్ బార్క్ అన్నారు.

## 'నువ్వొక బచ్చాగాడివి, నీకేం తెలుసు'..తేజస్విపై మండిపడ్డ బీహార్ సీఎం



పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి (బీహార్ సీఎం) నితీశ్ కుమార్ (నితీష్ కుమార్), ఆర్జేడీ అగ్రనేత (ఆర్జేడీ అగ్రనేత), ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తేజస్వియాదవ్ (తేజస్వి యాదవ్) మధ్య అసెంబ్లీ (అసెంబ్లీ) లో తీవ్ర వాగ్వాదం జరిగింది. బీహార్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా తేజస్వియాదవ్ తన గళం వినిపించారు. కానీ ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ సీఎం నితీశ్ వాగ్వాదానికి దిగారు. ఓ సందర్భంలో నితీశ్ కుమార్ ఆగ్రహంతో ఊగిపోతూ.. 'నువ్వొక బచ్చగాడివి, నీకేం తెలుసు..?' అని తేజస్విపై చల్లబడింది.ముందుగా తేజస్వి యాదవ్ మాట్లాడుతూ.. 'నేను కేవలం నాలుగు విషయాలు అడుగుతా. ఓటర్ లిస్టును గత ఫిబ్రవరిలో ఒకసారి ప్రచురించారు. లోక్‌సభ తర్వాత ఎన్నికల రివిజన్ జరగాల్సింది. కానీ దానికి బదులుగా అసెంబ్లీ ఎన్నికల వేళ ఇప్పుడు రివిజన్ చేస్తున్నారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు కోసం 11 రకాల డాక్యుమెంట్లు అడుగుతున్నారు. పేదలు, నిరక్షరాస్యులకు ఆ 11 రకాల డాక్యుమెంట్లను కేవలం 25 రోజుల్లో సిద్ధం చేసుకోవడం సాధ్యమా..? ఇది పేదలకు, నిరక్షరాస్యులకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆర్థికభారంగా మారింది. ఎన్నికల సంఘం తీరుతో పేదలు ఎన్నికలకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఓటు అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు. ఆ హక్కును ఈసీ పేదలకు దూరం చేస్తోంది.' అని ప్రస్తావించారు.దాంతో ఆగ్రహించిన సీఎం తేజస్విపై విమర్శలతో విరుచుకుపడ్డారు. 'నువ్వేం మాట్లాడుతున్నావ్. ఇలా ఎందుకు మాట్లాడుతున్నావ్. నువ్వు పిల్లవాడిగా ఉన్నప్పుడు నీ తల్లిదండ్రులిద్దరూ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసా..? మీరు మంచిగా పని చేయడంలేదనే మేం దూరం జరిగింది. ఈ ఏడాది ఎన్నికలు జరుగుతున్నాయి. ఏం చేయాలో ప్రజలు తేల్చుకుంటారు. మా ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేసింది. ఇలాంటి వాళ్లు (తేజస్వియాదవ్‌ను ఉద్దేశించి) ఓట్ల కోసం ఏదైనా మాట్లాడుతారు. మీ హయాంలో మహిళలకు ఏమైనా మేలు జరిగిందా..? మేం మహిళల కోసం ఎంతో చేశాం. ముస్లింల కోసం ఆర్జేడీ చేసిందేమీ లేదు. మేం ముస్లింల క్షేమం కోసం పనిచేస్తున్నాం. నువ్వు కేవలం ఒక బచ్చాగాడివి, నీకేం తెలుసు..? ఆర్జేడీ హయాంలో సాయంత్రం అయితే పట్నాలో ప్రజల ఇళ్ల నుంచి బయటికి రావడానికి భయపడేవారు. మేం చేసిన అభివృద్ధి పనులతో ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తాం.' అని నితీష్ కుమార్ చర్య.కాగా బీహార్‌లో ఈసీ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై పార్లమెంట్‌లో కూడా గత మూడు రోజులుగా రభస జరుగుతోంది. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయసభలు ఎలాంటి చర్చ లేకుండా వాయిదా పడుతున్నాయి.

## జస్టిస్ వర్మ కోసం టాప్ లాయర్లు.. విచారణకు సీజేఐ దూరం



న్యూఢిల్లీ,జస్టిస్ యశ్వంత్ వర్మ నోట్ల కట్టల ఆరోపణల వ్యవహారంలో శరవేగంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు పార్లమెంట్‌లో ఆయన్ని అభిశంసించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు.. సుప్రీం కోర్టులో ఆయన వేసిన పిటిషన్‌పై ఇవాళ కీలక పరిణామం చోటుచేసుకుంది. జస్టిస్ యశ్వంత్ వర్మ పిటిషన్ విచారణ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం వైదొలిగారు. ఈ పిటిషన్‌ను విచారించేందుకు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయిస్తామని తెలిపారా యన. "బహుశా ఈ పిటిషన్‌ను నేను విచారణ చేయలేనుకుంటా. ఎందుకంటే.. జస్టిస్ సంజీవ్ ఖన్నా(మాజీ సీజేఐ) నేతృత్వంలో జరిగిన విచారణలో నేను భాగమయ్యాను. కాబట్టి దీన్ని వేరొక బెంచ్‌కు బదిలీ చేస్తా" అని పిటిషన్ తరఫు న్యాయవాది కపిల్ సిబాల్‌కు సీజేఐ స్పష్టం చేశారు. మార్చి 14వ తేదీన ఢిల్లీ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహించిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం సంభవించి.. కాలిన స్థితిలో నోట్ల కట్టలు కనిపించాయి. 'న్యాయవ్యవస్థలో అవినీతి..' అంటూ ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన సుప్రీం కోర్టు.. ఆయన్ని హుటాహుటిన అలహాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేసింది. అదే సమయంలో ఈ ఘటనపై దర్యాప్తునకు ముగ్గురు జడ్జిల కమిటీని ఏర్పాటు చేయించింది. ఆ కమిటీ తన నివేదికను అప్పటి చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు అందించగా.. ఆయన దానిని లేఖ రూపంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు పంపారు. ఆ నివేదిక ప్రకారం.. జస్టిస్ యశ్వంత్ వర్మ అవినీతికి పాల్పడ్డారని, స్వచ్ఛందంగా రాజీనామాకు ఆయన అంగీకరించలేదని, కాబట్టి ఆయన్ని తొలగించాలని ఇన్-హౌజ్ కమిటీ సిఫార్సు చేసింది. అయితే తన వాదన వినకుండానే చర్యలు తీసుకుంటున్నారని సుప్రీం కోర్టులో జడ్జి యశ్వంత్ వర్మ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను అత్యవసరం గా విచారణ చేపట్టాలని ఇవాళ(బుధవారం) ఆయన తరఫు లాయర్ కపిల్ సిబాల్ సీజేఐ బెంచ్‌ను కోరారు. జస్టిస్ వర్మ తరఫున కపిల్ సిబాల్‌తో పాటు ముకుల్ రోహత్గి, రాకేష్ ద్వివేది, సిద్ధార్థ్ లూథ్రాలాంటి టాప్ లాయర్లు వాదనలు వినిపిస్తుండడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఈ పార్లమెంట్ సెషన్‌లోనే ఆయనపై అభిశంసనకు చర్యలు నడుస్తున్నాయి. ఇలాంటి అభిశంసన తీర్మానం కోసం లోక్‌సభలో కనీసం 100 మంది, రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యులు అభిశంసన నోటీసుపై సంతకం చేయాలి. అయితే జస్టిస్ వర్మ కేసులో ఇప్పటికే 145 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు ఇప్పటికే అభిశం సన నోటీసుపై సంతకం చేశారు. జడ్జి తొలగింపు కోసం భారత రాజ్యాంగంలోని 124, 217, 218 ఆర్టికల్స్ ప్రకారం నోటీసు దాఖలైంది. అయితే.. ఎంపీలు ఇచ్చిన అభిశంసన నోటీసును స్వీకరించిన కొన్ని గంటలకే రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి అయిన జగ్దీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం.

**నెక్ట్స్ ఏంటంటే..**

లోక్‌సభ స్పీకర్ , రాజ్యసభ ఛైర్మన్ సంయుక్తంగా ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని నియమించనున్నారు. ఈ కమిటీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఒకరు, ఓ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఓ ప్రఖ్యాత న్యాయవేత్త ఉంటారు. ఈ కమిటీకి నివేదిక సమర్పించడానికి మూడు నెలల గడువు ఇస్తారు. అయితే ఈ కమిటీ ముందు తన వాదనలు వినిపించేందుకు జస్టిస్ యశ్వంత్ వర్మకు అవకాశం(మూడుసార్లు) ఉంటుంది. గతంలో త్రీజడ్జి కమిటీ సమర్పించిన నివేదికతో పాటు జస్టిస్ వర్మ వాదనలు, సాక్ష్యాలను పరిశీలించాకే స్పెషల్ కమిటీ ఒక నివేదికను సమర్పిస్తుంది. ఈపై ఇరు సభల్లో ఆ నివేదికపై చర్చ జరిగాక.. అభిశంసన తీర్మానాన్నిప్రవేశపెడతారు. దానిని 2/3 మెజారిటీతో సభ్యులు ఆమోదించాక రాష్ట్రపతికి పంపిస్తారు. అప్పుడు ఆయన తొలగింపుపై రాష్ట్రపతి సంతకం చేసి ఉత్తర్వులు జారీ చేస్తారు. అయితే ప్రస్తుతం పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడుతున్నాయి. అదే సమయంలో ఆయన పిటిషన్ సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆగష్టు 21వ తేదీతో పార్లమెంట్

## పార్టీ అన్నాక విభేదాలు సర్వసాధారణం

న్యూఢిల్లీ,జూలై23,పార్టీ అన్నాక వ్యక్తులు, వారి మధ్య విభేదాలు సహజమని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఇది అన్ని పార్టీల్లోనూ ఉందన్నారు. కుటుంబ పార్టీల్లో కూడా అన్నా చెల్లెళ్లకు, కూడా విభేదాలు ఉన్నాయని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ , మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ వివాదంపై ధర్మపురి అరవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీల్లో నేతల మధ్య ఉన్న వైరంపై కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. బుధవారం అరవింద్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో రాజగోపాల్ రెడ్డి ఏం చేస్తున్నాడు.. ఆ పార్టీ హై కమాండ్ ఏం చేస్తోంది. అలాగే కొండా మురళి, కొండా సురేఖలు ఏం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో కవిత, కేటీ-ఆర్ ఏం చేస్తున్నారు. పార్టీ అన్నాక కొన్ని వివాదాలు నడుస్తూ ఉంటాయి. బీజేపీ పాత అధ్యక్షుడు, కొత్త అధ్యక్షుడు కలిసి ఈటెల రాజేందర్, బండి సంజయ్‌ల విషయంలో కూర్చోని మాట్లాడాలని సూచించారు. అవసరమైతే బీజేపీ అధిష్టానం పెద్దలు మాట్లాడాలని చెప్పుకొచ్చారు. ఈటెల, బండి సంజయ్‌ల విషయంలో బీజేపీ కేంద్ర హై కమాండ్ నోడల్ ఎంక్వయివరీ కమిషన్ వేసుకోవాలని సూచించారు. రాజాసింగ్ ఎక్కడున్నా తాము గౌరవిస్తామని.. ఆయన ఐడియాలాజికల్ మ్యాప్ అని అభివర్ణించారు. ఆయన సస్పెండ్ కాలేదని.. రిజైన్ చేశారని గుర్తుచేశారు. రాజాసింగ్ రేపు పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇస్తే మెంబర్‌షిప్ తీసుకోవచ్చని సూచించారు. కొన్ని విషయాల్లో మనస్థాపం చెంది రాజాసింగ్ రాజీనామా చేశారని చెప్పుకొచ్చారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఒక్కొక్కరికి రెండు నియోజకవర్గాల బాధ్యతలు ఇవ్వాలని ఎంపీ అరవింద్ కోరారు. ఎంపీలు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని.. ఫలితం చూపించకపోతే పక్కకు పెట్టాలని అన్నారు. ఏ పార్టీకైనా కార్యకర్తలు కీలకమని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అయ్యే సమయం ఇదని ఉద్ఘాటించారు. ఇందూరు జిల్లాలో జిల్లా పరిషత్



చైర్మన్ పదవిని తాము గెలుస్తున్నామని జోస్యం చెప్పారు. తెలంగాణలో వచ్చేవి కార్యకర్తల కోసం జరిగే ఎన్నికలని.. బీజేపీ శ్రేణులు ఈ విషయాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. తమ కార్యకర్తలను నాయకులుగా చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎంపీ ధర్మపురి అరవింద్ పిలుపునిచ్చారు.

### శ్రీశైలంలో వైభంగా ఆరుద్రోత్సవం

శ్రీశైలం, శ్రీశైలంలో బుధవారం ఆరుద్రోత్సవాన్ని వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు వైభవంగా స్వర్ణ రథోత్సవం జరిగింది. వేకువజామున శ్రీమల్లికార్జున స్వామికి అర్చకులు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు.

## సంపాదకీయం

**గురువారం 24-07-2025**

# ఎన్నాళ్లీ జనహననం?

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేసి ప్రపంచాన్ని నివ్వెరపరిచిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గాజాలో కొనసాగిస్తున్న మారణకాండను ఆపదల్చుకోలేదని తాజా అమానుష ఉదంతం రుజువు చేస్తోంది. నిరాయుధ పౌరులనూ, మరీ ముఖ్యంగా స్త్రీలనూ, పిల్లలనూ హతమార్చటం ఇజ్రాయెల్ సైన్యానికి గత ఇరవైయ్యొక్క నెలలుగా రివాజుగా మారినా... ఆదివారం జరిగిన ఘోరం అత్యంత హేయమైనది. ఐక్యరాజ్యసమితి సంస్థ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూఎఫ్‌పీ) ఆధ్వర్యాన ఆహార పంపిణీ మొదలుపెట్టబోతుండగా పౌరు లను చుట్టుముట్టి శతఘ్నులతో, స్నైపర్లతో విరుచుకుపడి 90 మందికిపైగా పౌరుల్ని ఇజ్రాయెల్ సైన్యాలు పొట్టనబెట్టుకున్నాయి. 2023 అక్టోబర్ 7న తమ భూభాగంలోకి అడుగుపెట్టి 1,200 మంది పౌరులను కాల్చిచంపి, మరో 251 మందిని అపహరించిన మిలిటెంట్ సంస్థ హమాస్‌ను తుదముట్టించటానికి దాడులంటూ మొదట్లో చెప్పిన ఇజ్రాయెల్ ఆనాటినుంచి మారణకాండ కొనసాగిస్తూనే ఉంది. అధికారిక లెక్క ప్రకారం ఇప్పటికి 60,000 మంది పౌరులు మరణించారంటున్నా... అంతర్జాతీయ మేగజిన్ లాన్సెట్ నిరుడు జూన్‌లో ప్రకటించిన నివేదిక అది దాదాపు రెండు లక్షలంటోంది. మధ్యధరా సముద్ర తీరానవున్న గాజా స్ట్రిప్ అనే చిన్న ప్రాంతాన్ని వదిలి రావటానికి ససేమిరా అంటున్న స్థానికులను హతమార్చయినా ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ ప్రయ త్నిస్తోంది. ఆ ప్రాంతాన్ని సైతం తమ దేశంలో విలీనం చేసుకోవాలన్నది దాని ఆంతర్యం. గతంలో పాలస్తీనాపై విరుచుకుపడినప్పుడల్లా ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని 51వ అధికర ణాన్ని ఇజ్రాయెల్ ప్రస్తావించేది. సాయుధ మూకలు దాడులకు దిగితే ఆత్మరక్షణ చేసుకునే హక్కు దేశాలకుంటుందని ఆ అధికరణ చెబుతోంది. కానీ పాలస్తీనాలో తనదికాని భూభాగాన్ని ఆక్రమించుకుని, దాన్ని విస్తరించాలనుకున్నప్పుడల్లా ఇజ్రాయెల్ ఈ అధికరణను సాకుగా చూపుతోంది. హమాస్ సంస్థ దాడుల్ని ఎవరూ సమర్థించరు. ప్రజల కోసం పోరాటం చేస్తున్నామని చెబుతూ వారికే నష్టం కలిగించే ఆ సంస్థ చర్యల్ని మొదటినుంచీ అందరూ వ్యతిరేకి స్తున్నారు. కానీ గత 21 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండ మాటేమిటి? కేవలం 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల చిన్న ప్రాంతంపై యుద్ధ విమానాలతో, బాంబులతో, క్షిపణులతో దాడులు సాగించటం ఏ అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం సబబవుతుంది? ఇజ్రాయెల్ మిత్ర దేశమన్న సాకుతో పెద్ద పెద్ద దేశాలే అది సాగిస్తున్న మారణకాండను విస్మ రిస్తున్న తరుణంలో ఇటీవల 12 చిన్న దేశాలు కొలంబియాలోని బగోటాలో అత్యవసర శిఖరాగ్ర సదస్సు నిర్వహించి కార్యాచరణకు దిగబోతున్నట్టు ప్రకటించటం ఉన్నంతలో ఊరటనిచ్చే అంశం. బొలీవియా, కొలంబియా, క్యూబా, ఇండొనేసియా, ఇరాక్, లిబియా, మలేసియా, నమీ బియా, నికరాగువా, ఒమన్, సెయింట్ విన్సెంట్, దక్షిణాఫ్రికాలు వీటిలో వున్నాయి. ఈ సమావేశానికి హాజరైనా, అది విడుదల చేసిన సంయుక్త ప్రకటనపై సంతకం చేయాలా వద్దా అన్న మీమాంసలో పడిన మరో 20 దేశాలు వచ్చే సెప్టెంబర్‌కల్లా ఏ సంగతీ తేల్చాలని సదస్సు గడువు విధించింది. ఇజ్రాయెల్‌పై దక్షిణాఫ్రికా ఇప్పటికే అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో ఫిర్యాదు చేసింది. తనదికాని ఒక ప్రాంతంపై దండెత్తి, అక్కడి పౌరులు ఎటువైపు కదలాలో హుకుం జారీ చేసే ఇజ్రాయెల్ ఆగడం నాగరిక ప్రపంచ ఉనికికే పెను సవాలు. ఇజ్రాయెల్ ఇష్టారాజ్యంగా మానవ హననానికి పాల్పడుతుంటే చూస్తూ కూర్చున్న దేశాలకు కూడా రేపన్నరోజు ఇదే గతి పట్టదన్న గ్యారెంటీ ఏం లేదు. అందుకే అంతర్జాతీయ చట్టాలకూ, ఐక్యరాజ్యసమితి చార్టర్లకూ, మానవ హక్కులకూ ఇజ్రాయెల్ పెనుముప్పుగా మారిందని 12 దేశాల సదస్సు వ్యాఖ్యానించింది. అయితే ఇజ్రాయెల్ ఏం చేసినా సమర్థించటం అలవాటైన అమెరికాను కాదని ఎన్ని దేశాలు ఈ సదస్సుతో గొంతు కలుపుతాయన్నది ప్రశ్నార్థకం. ఇప్పటికే 'ఇంకా' సంతకం చేయని దేశాలకు దూతల్ని పంపి 'దారికి తేవాలని' అమెరికా నిర్ణయించుకుంది. ఈ సదస్సుపై ట్రంప్ కారాలూ మిరియాలూ నూరుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఉనికిలోకొచ్చిన అంతర్జాతీయ సంస్థలు మొదటినుంచీ ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరిస్తున్నాయి. అందరికీ ఒకే న్యాయం భావన వదిలి సంపన్న దేశాలతో ఒక విధంగా, బడుగు దేశాలతో మరో రకంగా ప్రవర్తిస్తున్నాయి. అందువల్లే ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి తదితర వేదికలపై ఇప్పుడెవరికీ పెద్దగా భ్రమలు లేవు. ఉన్నంతలో కొలంబియా సదస్సు ఒక ఆశాకిరణం. ఆహార పంపిణీ కేంద్రాలు ఐక్యరాజ్యసమితి సంస్థల కనుసన్నల్లోనే వుంటున్నా అవి పాలస్తీనా ప్రజల పాలిట ఉచ్చుగా మారుతున్నాయి. ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు మాత్రమే కాదు.. చివరకు ఆహార పంపిణీ కేంద్రాలు సైతం ఇజ్రాయెల్ సైనికుల దాడులకు లక్ష్యమవుతున్నాయి. ఆకలితో నకనకలాడుతూ తిండికోసం జనం ఒకచోట గుమిగూడినప్పుడు కాల్చి చంపితే గాజాను ఖాళీ చేయించాలన్న తమ పథకం పారుతుందని ఇజ్రాయెల్ భావిస్తున్నట్టుంది. ఒకనాడు నాజీ జర్మనీ లక్షలాదిమంది యూదుల్ని చిత్రహింసల శిబిరాలకు చేర్చి అమానుషంగా అంతమొందించింది. ఆ తరహాలోనే పాలస్తీనాలో రఫా వంటి చోట్ల శిబిరాల నిర్మాణం మొదలైంది. మరో జనహననాన్ని నాగరిక ప్రపంచం సహిస్తుందా? ప్రపంచ ప్రజానీకం మేల్కొని తమ తమ దేశాల్లోని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తే తప్ప ఇజ్రాయెల్ దురాగతాలు ఆగవు.

# నాయకులూ రిటైర్ కావలసిందే!



న్యూఢిల్లీ,సమాజంలో వయసు పైబడిన వారు కుటుంబం, వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకొని తమ వారసులకు, ఇతరులకు అప్పచెప్పడం సహజంగా జరిగే పని. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ స్వతంత్ర ప్రతిపత్తి సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారులు, సభ్యులు నిర్ణీత వయస్సు పరిమితితోనే పదవీ విరమణ చేస్తున్నారు. దేశంలో లోక్‌సభ సభ్యులు, రాష్ట్రాలలో శాసనసభ్యులుగా ఎన్నిక కావడానికి 25 సంవత్సరాలు అర్హతగా ఉంది. రాజ్యసభ సభ్యులు, వివిధ రాష్ట్రాల శాసనమండలి సభ్యులుగా ఎంపిక కావడానికి 30 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. భారతదేశంతో సహా ప్రపంచంలో అనేక దేశాలలో చట్టసభలకు ఎన్నిక కావడానికి, చట్టసభల సభ్యత్వం ద్వారా వచ్చే వివిధ పదవులు చేపట్టడానికి ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధనలు ఆయా రాజ్యాంగాలలో ప్రస్తావించబడలేదు. భారతదేశంలో అతిపెద్ద వయసులో ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి మొరార్జీ దేశాయి. 1977లో భారత ప్రధాన మంత్రిగా పనిచేసిన మొరార్జీ దేశాయ్ వయసు 81 సంవత్సరాలు. 1984లో ఇందిరా గాంధీ మరణాంతరం ప్రధాని పదవిని చేపట్టిన రాజీవ్ గాంధీ వయసు 40 ఏళ్లు. దేశంలో అతి చిన్న వయసులో ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ ఎన్నికై తన పనితీరుతో యువత రాజకీయాల్లోకి రావడానికి ప్రేరణగా నిలిచాడు. రాజీవ్ గాంధీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన తీరుతో ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నాడు. మొరార్జీ దేశాయ్, రాజీవ్ గాంధీలు ప్రధానమంత్రులుగా ఎన్నికైన సందర్భాలలో వీరి వయసుకు సంబంధించి సర్వత్రా చర్చ జరిగింది. రాజీవ్ గాంధీ తదనంతరం రాజకీయ నాయకుల వయసుకు సంబంధించిన అంశానికి ప్రాధాన్యత లేకుండాపోయింది. 2014లో దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటి వరకు రాజకీయ నాయకుల వయోపరిమితి పై చర్చ జరుగుతూనే ఉంది. ఇటీవల ఆర్‌ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రాజకీయ నాయకుల పదవీ విరమణ వయసుపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగ సంచలనానికి కేంద్రబిందువుగా నిలిచాయి. దేశంలో రాజకీయ నేతలు 75 ఏళ్లు రాగానే పదవీ విరమణ తీసుకుని ఇతరులకు అవకాశం ఇవ్వాలని సూచించారు. నాగపూర్‌లో దివంగత ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త మోరో పంత్ పింగ్లి కి సంబంధించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మోహన్ భగవత్ మాట్లాడిన మాటలపట్ల దేశవ్యాప్తంగా చర్చలు మొదలయ్యాయి. 75 ఏళ్లు నిండిన తర్వాత మీకు శాలువాతో సత్కారం లభిస్తే దాని అర్థం మీరు ఇక ఆగిపోవాలని, పక్కకు తప్పుకుని ఇతరులకు అవకాశం ఇవ్వాలి అంటూ గతంలో మొరోపంత్ పింగ్లి మాట్లాడిన మాటలను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ పేర్కొన్న వైనం పలువురిని దిగ్భ్రాంతి పరిచింది. మోహన్ భగవత్ మాట్లాడిన మాటల పట్ల కమలనాథులలో అంతర్మథనం జరుగుతోంది. గత కొన్నాళ్లుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, బిజెపిల మధ్య వైరుధ్యాలు కొనసాగుతున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజెపి అధ్యక్షుడు నడ్డా మాట్లాడిన మాటలు ఆర్ఎస్ఎస్‌కు ఆగ్రహం తెప్పించాయి. ప్రస్తుత పరిస్థితులలో బిజెపి బాగా పటిష్టపడిందని తన వ్యవహారాలను తానే నిర్వహించుకునే శక్తిసామర్థ్యాలు పార్టీకి ఉన్నాయని నడ్డా చెప్పిన మాటలు ఆర్ఎస్ఎస్ కు బిజెపికి మధ్య అగాధాన్ని పెంచాయి. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం ఆర్ఎస్ఎస్ చీఫ్ చేసిన వ్యాఖ్యలు బిజెపిలో తీవ్ర దుమారం లేపాయి. నిజమైన సేవకుడు అహంకారంతో ఉండడు, ఇతరులకు ఎలాంటి హానిని కలిగించక తన పని చేసుకుంటూ ముందుకు సాగుతాడని మోహన్ భగవత్ మాట్లాడిన మాటలు బిజెపిలో ఆందోళన రేకెత్తించాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 17 తో ప్రధాని మోడీకి 75 ఏళ్లు, సెప్టెంబర్ 11 నాటికి ఆర్ఎస్ఎస్ చీఫ్‌కు కూడా 75 ఏళ్లు నిండుతున్న తరుణంలో మోహన్ భగవత్ మాటలు ప్రధాని మోడీని ఉద్దేశించి మాట్లాడారా? లేక తన రిటైర్మెంట్ గురించి మాట్లాడారా? అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి. ఇరువురు నేతలు కూడా తమ పదవుల నుంచి వైదొలిగి ఇతరులకు బాధ్యతలు అప్పజెప్పాలని ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. మోహన్ భగవత్ నాగపూర్ లో ఏలికల పదవీ విరమణ పై మాట్లాడిన నాడే మరో కార్యక్రమంలో అహ్మదాబాద్‌లో అమిత్ షా మాట్లాడుతూ తాను రిటైర్ అయ్యాక వేదాలు, ఉపనిషత్తులు చదవడానికి, ప్రకృతి సేద్యం చేయడంలో తన శేష జీవితాన్ని గడుపుతానని మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాలలో ఆసక్తికరంగా మారాయి. 1984 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమైన బిజెపిని 1989 లోక్‌సభ ఎన్నికలలో 85 సీట్లకు, 1991 ఎన్నికల నాటికి 120 సీట్లకు పెంచి 1996 ఎన్నికల్లో 161 సీట్లలో విజయం సాధించి తొలిసారి అధికార పీఠం సాధించడంలో కీలకమైన పాత్ర అద్వానీదే. 1999 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి 182 సీట్లు గెలిచి ఐదేళ్లపాటు వాజ్‌పేయి ప్రధానిగా సుస్థిర ప్రభుత్వం ఏర్పరచటంలో అద్వానిదే ప్రధాన భూమిక. 2004, 2009 లోక్‌సభ ఎన్నికలలో ఎల్‌కె అద్వానీ నాయకత్వం లో పోటీ చేసిన బిజెపి మెజారిటీ సాధించకపోవడంతో ప్రధానమంత్రి పదవిని చేపట్టలేకపోయారు.

# స్వపక్షాల్లో విపక్షాలు!.. తెలంగాణ పొలిటికల్ గేమ్స్

హైదరాబాద్ : సాధారణంగా రాజకీయాల్లో అధికారపక్షం, ప్రతిపక్షం ఉంటాయి. కానీ.. తెలంగాణ రాజకీయాల్లో మరో స్పెషల్ కూడా ఉన్నది. అదే స్వపక్షంలో విపక్షం. పార్టీలో ఆధిపత్యం కోసం ఆరాటం. ప్రత్యర్థి పార్టీలతో పోరాడుతున్న రాజకీయ పార్టీలు.. అంతర్గత తలనొప్పులపైనా దృష్టిసారిస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. ఇది తాడో పేడో తేల్చుకునే స్థాయికి వెళుతున్నాయి. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల్లో ఈ ధోరణి బలంగానే ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఆ యా పార్టీల అధిష్ఠానాలకు తలనొప్పిగా తయారైంది. ఇప్పటి వరకూ పార్టీ వేదికలు, నాయకుల సమావేశాలకు పరిమితమైన ఆధిపత్యపోరు.. ఇప్పుడు రోడ్డున పడుతున్నది. ఎవరి బలం ఎంతో చాటుకునేందుకు సిద్ధం అవుతున్నారు. ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తప్పుబట్టి హాట్ టాపిక్ అయ్యారు. ఇక బీఆర్ఎస్‌లో కవిత ఎపిసోడ్ కొనసాగుతోంది. తెలంగాణ జాగృతి కార్యక్రమాలను ఆమె విస్తృతం చేస్తున్నారు. పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారు. మరో వైపు కమలం పార్టీ కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాటల యుద్ధం సాగుతోంది. ఇంతకాలం వీరిద్దరి మధ్య ఉన్న అంతర్గతపోరు బయటకు వచ్చింది. సై అంటే సై ఈ ఇద్దరు నాయకులు తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు.

### రేవంత్ కు షాకిచ్చిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఎక్కువ అంటుంటారు. కొన్ని సమయాల్లో ఇవే ఆ పార్టీ నాయకత్వానికి తలనొప్పులు కలిగిస్తున్నాయి. జూలై 18న నాగర్ కర్నూల్ జిల్లా జటప్రోలులో నిర్వహించిన సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో చర్చకు కారణమయ్యాయి. వచ్చే పదేళ్లు తానే తెలంగాణ సీఎంగా ఉంటానని ఆయన ప్రకటించుకున్నారు. గత ఎన్నికల అనంతరం సీనియర్‌లు ఆఖరు నిమిషం వరకూ ప్రయత్నాలు చేసినా.. సీఎం పీఠాన్ని అధిష్ఠానం రేవంత్‌రెడ్డికే అప్పగించింది. సీఎం ఎంపిక విషయంలో కాంగ్రెస్ నాయకత్వానిదే తుది నిర్ణయం. అయితే వచ్చే పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తప్పుబడుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాజగోపాల్ పోస్టులో కాంగ్రెస్‌లో చర్చకు దారితీసింది. క్యాబినెట్‌లో చోటు దక్కని కారణంగా రాజగోపాల్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. సామాజిక సమీకరణాల నేపథ్యంలో క్యాబినెట్‌లో రాజగోపాల్ రెడ్డికి చోటు దక్కని విషయాన్ని కాంగ్రెస్ నాయకత్వం వివరించింది. క్యాబినెట్ విస్తరణ జరిగిన రెండు మూడు రోజులకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పదవి రాకపోయినా కార్యకర్తగానే పనిచేస్తానని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో పార్టీలో నంబర్ వన్ పొజిషన్‌లో ఉన్న సీఎంనే సవాలు చేయడం ద్వారా రానున్న రోజుల్లో చాలా పరిణామాలే చోటు చేసుకుంటాయనే సంకేతాలు రాజగోపాల్ ఇచ్చారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### బీజేపీలో బండితో ఢీ అంటే ఢీ అంటున్న ఈటల

కమలం పార్టీలో కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మధ్య ఢీ అంటే ఢీ అంటున్నారు. గత కొంతకాలంగా వీరిమధ్య ఉన్న అంతర్గత పోరు బహిరంగమైంది. ఒకే పార్టీలో ఉన్న వీరిద్దరికీ పొసగడం లేదు. పార్టీలో పట్టుకోసం ఈటల ప్రయత్నిస్తున్నారు. ఇద్దరూ బీసీ సామాజికవర్గానికి చెందినవారే. ఇద్దరిదీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా. బండి సంజయ్ మొదటి నుంచి బీజేపీలో ఉన్నారు. విద్యార్థి దశలో ఈటల రాజేందర్ లెఫ్ట్ పార్టీలకు అనుబంధంగా ఉన్న విద్యార్థి సంఘంలో కీలకంగా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సాధనలో భాగంగా బీఆర్ఎస్‌లో చేరి.. ఆ పార్టీలో కీలక స్థానానికి ఎదిగారు. అయితే ఆ పార్టీలో కేసీఆర్‌తో ఏర్పడిన గ్యాప్.. ఆయన పార్టీ నుంచి బయటకు వచ్చేయడానికి కారణమైంది. దీంతో బీజేపీలో చేరారు. బీజేపీలో అమిత్ షా వంటి నాయకులతో ఆయనకు మంచి సంబంధాలున్నాయి. అయితే రాష్ట్రంలోని కొందరు నాయకులతో ఆయన ఇటీవల



గ్యాప్ ఏర్పడినట్టుగా ప్రచారం సాగుతోంది. బండి సంజయ్‌తో చాలాకాలంగా ఈ గ్యాప్ ఉందనే ప్రచారం పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ ఇద్దరు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర మంత్రి అమిత్ షా గతంలోనే సూచించినట్టుగా కూడా చెబుతారు. మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్ ఎంపీగా గెలవడంతో హుజూరాబాద్ కు ఆయన వెళ్లడం తగ్గించారు. అయితే హుజూరాబాద్ పై పట్టుపెంచుకొనేందుకు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారు. ఈటల రాజేందర్ బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన సమయంలో ఆయన అనుచరులంతా బీఆర్ఎస్ ను వీడి బీజేపీలో చేరారు. సంస్థాగత ఎన్నికల్లో తన అనుచరులకు ప్రాధాన్యం లేకపోవడం మొదలుకుని.. అప్పటికే రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కకపోవడం, అంతకు ముందు కేంద్ర క్యాబినెట్‌లో చోటు లభించకపోవడం వంటి అంశాలతో ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలోనే తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో చేసిన వ్యాఖ్యలతో ఈ అసంతృప్తి బహిరంగంగా మారింది. బండి సంజయ్ నుంచి తన అనుచరులకు ఎదురౌతున్న ఇబ్బందుల నేపథ్యంలో తాడో పేడో తేల్చుకోవాలని ఈటల డిసైడ్ అయ్యారని ఆయన మాటలను బట్టి అర్థమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### గులాబీ పార్టీలో కొనసాగుతున్న కవిత ఎపిసోడ్

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ కొనసాగుతోంది. బీఆర్ఎస్ రజతోత్సవ సభ గురించి ఫీడ్ బ్యాక్‌ఇస్తూ కేసీఆర్‌కు కవిత లేఖ రాశారన్న విషయం తొలుత బయటకు పొక్కగా.. ఆ తర్వాత ఏకంగా ఆ లేఖ సామాజిక మాధ్యమాలకు ఎక్కడంతో రచ్చ రోడ్డున పడింది. ఈ లీక్ పై కవిత అనుమానాలు వ్యక్తం చేశారు. కేసీఆర్ దేవుడంటూ ఆయన చుట్టూ దయ్యాలున్నాయని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. పరోక్షంగా ఆమె కేటీఆర్ పై విమర్శలు చేశారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. బీఆర్ఎస్‌లో కేసీఆర్ తనకు నాయకుడిని చెబుతూనే.. ఏ ప్రజా సంఘంలో లేని విధంగా ప్రజాసంఘంలో అనుబంధ సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దాని ద్వారా తన కార్యకలాపాలను నడిపిస్తున్నారు. ఒకప్పుడు కవిత వస్తే స్వాగతించే బీఆరెస్ నాయకులు ఇప్పుడు కనిపించడం లేదు. ఇప్పుడు జాగృతి శ్రేణులు మాత్రమే ఉంటున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం ఆర్డినెన్స్ తేవాలని రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని కవిత స్వాగతించారు. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తప్పుబట్టింది. కవితపై తీన్మార్ మల్లన్న చేసి వ్యాఖ్యల విషయంలో బీఆర్ఎస్ స్పందించలేదు. శాసనమండలిలో విపక్షనాయకుడు మధుసూదనాచారి మాత్రమే కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను తప్పుబట్టారు. అంతేకానీ.. కేసీఆర్, కేటీఆర్ సహా ఇతరులెవరూ నోరు మెదపలేదు. దీంతో దీనిపై స్పందించే అంశాన్ని పార్టీ విజ్ఞతకు వదిలేస్తున్నానని కవిత వ్యాఖ్యానించడం ఆమెతో పార్టీకి పెరిగిన గ్యాప్‌ను స్పష్టంగా చెబుతున్నది. మరో వైపు బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ దారికే బీఆర్ఎస్ రావాల్సి ఉంటుందని చెప్పడంతో తాను వేరు, బీఆరెస్ వేరు అనే సంకేతాలు ఇచ్చినట్టయిందని విశ్లేషకులు చెబుతున్నారు. సింగరేణి బాధ్యతల నుంచి కవితను తప్పించడం పార్టీలో ఆమెకు ప్రాధాన్యం తగ్గించిన తొలి బహిరంగ చర్యగా నిలుస్తున్నది. బీఆర్ఎస్ తో సంబంధం లేకుండా జాగృతి ద్వారా కవిత ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అవి గులాబీ పార్టీకి రాజకీయంగా ఇబ్బందిగా మారుతున్న పరిస్థితులు కూడా నెలకొన్నాయి. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అంటూనే జాగృతి ద్వారా రాజకీయ పార్టీ తరహాలో కవిత కార్యక్రమాలు నిర్వహించడం రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమయ్యాయి.

# రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌పై దృష్టి

న్యూఢిల్లీ,ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేండ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీచేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. ఈనేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు- తెలుస్తున్నది. బీజేపీతోపాటు- ఎన్డీయే పక్షాలకు చెందిన నేతనూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈ నేపథ్యంలో జనతాదళ్ (యునై-టెడ్) ఎంపీ, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. త్వరలో బీహార్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన హరివంశ్‌ను ఇందుకు ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. రాజకీయంగా అ అవకాశాన్ని మోడీ ఉపయోగించుకునే తీరుతారని అంటున్నారు. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాలలో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పీజీ చేసియన ఆయన జర్నలిజ్యంలో డిప్లొమా అందుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు చాలా ఏండ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్ ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు. రవివార్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన.. ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

# రేడియో శ్రోతలకు గుర్తుండిపోయే చిత్తరంజన్

విజయవాడ,తన సలలిత రాగ సుధారసంతో ఓ తరాన్ని మైమరిపించిన స్వరనిధి డా. మహాభాష్యం చిత్తరంజన్. ఆయన మరణించి రెండేళ్లు అవుతోంది. అయితే పాతతరం వారికి ముఖ్యంగా రేడియో విన్న వారికి చిత్తరంజన్ చిరపరిచితుడు. ఓ రకంగా రేడియోకు ప్రాముఖ్యం తగ్గడంతో పాటు అలాంటి వారంతా వెళ్లిపోడం వెలితిగా అనిపించింది. రేడియో వింటూ అదే మహదానందంగా మురిసి పోయిన నిన్నటి తరానికి – సరళమైన, మధురమైన లలిత సంగీతపు రుచి చూపించిన స్వరమాంత్రికుడు చిత్తరంజన్. చిత్తరంజన్ రెండేళ్ల క్రితం జూలై 21న పరపదించారు. కూర్చోలేని పరిస్థితిలో కూడా ఆయన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఎనిమిదేళ్ల ప్రాయంనుంచే అప్పటి నిజాం ఆధీనంలోని దక్కన్ రేడియోలో పాడటంనుంచి, బాలమురళీకృష్ణగారి శిష్యరికంలో ఆయనతో కచేరీల్లో పాల్గొన్న రోజుల్నుంచి, రేడియోలో చేరి తేటతేట తెలుగు పదాల సుమధుర లలిత సంగీత బాణీలతో ఆబాలగోపాలాన్ని మైమర పించిన రోజులనుండి, ఎందరెందరికో గాయనీగాయకులుగా మరోజన్మ ఇచ్చిన మహానుభావుడాయన. సంగీత కుటుంబంలో జన్మించి, లలిత సంగీతాన్నే ఊపిరిగా చేసుకొని ఇక తన గాత్ర మాధుర్యాన్ని అందించారు. నేటి విపరీత పోకడల సంగీతపు హోరులో వారి పంచిన స్వర రుచి ఎంతకమ్మనో ఈ తరానికి తెలియకపోవచ్చు. కాని ఆయన ఎన్నో ఆపాత మధురమైన బాణీలు రేడియో రోజులనాటి తరానికి సాక్షులమైన వారి చెవులలో ఇప్పటికీ గింగురుమంటాయి. చిత్తరంజన్ అంటేనే తెలుగు రేడియో అన్నంతగా ఆయన మైమరపించారు. ఓ రకంగా చెప్పాలంటే ఆధునిక సోషల్ మీడియా, టీవీలు అగ్రభాగాన ఉన్నా.. ఆనాటి రేడియో కార్యక్రమాలే ఎంతో మిన్న అన్నట్లుగా ఉండేవి. అలా అవి ప్రజాదరణ పొందడానికి చిత్తరంజన్ లాంటి వారు ఎందరో కృషి చేశారు. ఆయనకునివాళిగా తెలుగువారు గుర్తుంచుకునేందుకే ఈ ప్రయత్నం.

# చెక్ పెట్టగలరా?

హైదరాబాద్,బీజేపీలో ఎలెక్టెడ్ పంచాయతీ ముగిసింది. ఇక సెలెక్టెడ్ పంచాయితీ తెర మీదకు వచ్చింది. తెలంగాణ బీజేపీలో ఇప్పుడు మరో ముసలం ముంచుకొస్తుందా.. సంస్థాగతంగా ఎన్నికలు నిర్వహించుకోవడికే నానా తంటాలు పడిన కమలం పార్టీ ఇప్పుడు సెలెక్టెడ్ పదవులను ఎంపిక చేయడంలో ఏం చేయబోతుంది? వచ్చే ముసలాన్ని ఏ విధంగా ఎదురుకోబోతుం ది? కార్యవర్గం ఎంపికలో నూతన అధ్యక్షుడు రామచంద్రరావు అనుసరించబో తున్న వ్యూహమేంటి? ప్రస్తుతం రాష్ట్ర బీజేపీలో చర్చంతా దీని గురించేనంట.

### బీజేపీ రాష్ట్ర సారథిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రామచంద్రరావు

బీజేపీ తెలంగాన అధ్యక్షుడి ఎన్నిక విషయంలో ఉత్కంఠకు తెరపడింది. పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావును రాష్ట్ర పార్టీ నూతన రథ సారథిగా డిల్లీ పెద్దలు నియమించారు. బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్ర రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలుండగా, బీజేపీ లెక్కల ప్రకారం 38 జిల్లాలు ఉన్నాయి. ఇప్పటికే ఒకటి రెండు జిల్లాలు మినహాయిస్తే జిల్లాల అధ్యక్షుల ఎన్నిక పూర్తి చేసుకుంది. ఇక ఇప్పటిదాకా ఇదంతా బానే జరిగినా.. బీజేపీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావు ముందు ఉన్న సవాళ్ళు.. ప్రతి సవాళు ౖ మాత్రం ముళ్ళ కంచెలా మారాయన్న టాక్ వినిపిస్తోంది.

### సెలెక్టెడ్ పదవుల్ని ఎలా భర్తీ చేస్తారని చర్చ

అధ్యక్ష పదవుల ఎన్నిక ఒకే కానీ నెక్స్ట్ సెలెక్టెడ్ పదవులైన రాష్ట్ర కార్యవర్గ కూర్పును రామచంద్ర రావు ఏ విధంగా ఎదుర్కుంటారనే చర్చ పార్టీలో స్టార్ట్ అయిందట. ఇప్పటికే జిల్లాల అధ్యక్షుల నుంచి రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికకు సంబందించి నేతల్లో అసంతృప్తి భగ్గుమంటోంది. ఇలాంటి తరుణంలో రామ చంద్ర రావు ఇంట గెలిచి బయట గెలవాల్సిన పరిస్థితి. పదవుల పందారం నేపథ్యంలో నేతల మధ్య ముంచుకురానున్న ముసలాన్ని ఆయన ఎదురుకోగలుగుతారా..అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### రామచంద్రరావు పార్టీలో ఆధిపత్యపోరుకు చెక్ పెట్టగలరా?

తెలంగాణ బీజేపీ పగ్గాలను రాంచంద్ర రావు చేపట్టారు. అనూహ్యంగా కొత్త సారథిగా బాధ్యతలు దక్కించుకున్న రాంచంద్రరావుకు పార్టీలో అనేక సమస్యలు సవాళ్లు విసురుతున్నాయి. పార్టీలో ఆధిపత్య పోరుకు చెక్ పెట్టడం ఆయన ముందున్న అతిపెద్ద సమస్య. 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ముగ్గురు ఎమ్మెల్సీలతో తెలంగాణలో బీజేపీ చట్ట సభల బలం 21 మందికి చేరింది. 21 మందిలో తాజాగా రాజాసింగ్ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇద్దరు కేంద్ర మంత్రులను, 8 మంది సీనియర్ ఎంపీలను కొత్త అధ్యక్షుడు ఎలా సమన్వయం చేసుకుంటారనేది ఇంట్రెస్టింగ్ గా మారింది.

### రాష్ట్ర అధ్యక్ష పీఠంపై ఆశలు పెట్టుకున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

అంతేకాదు ఎంపీల్లో, ఎమ్మెల్యేల్లో పలువురు అధ్యక్ష పీఠంపై ఆశలు పెట్టుకుని నిరాశకు గురయిన పరిస్థితులు ఉన్నాయి.

# తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం

తిరుమల, తిరుమలలో రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మించేందుకు.. దీనిపై సాధ్యసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయించినట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇవో శ్యామలారావు తెలిపారు. తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా పరిపాలనా భవనం నిర్మించాలని నిర్ణయించామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి మంగళవారం సమావేశం అయింది. ఈ సమావేశంలో టీటీడీ పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాలక మండలిలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు ఛైర్మన్ బార్ నాయుడు, టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -3 నిర్మాణంపై చర్చించామని... కమిటీ- నివేదిక మేరకు ఈ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సామాన్య భక్తులకు అదనంగా వసతి సదుపాయలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అలిపిరి వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు ఓ కమిటీని నియమించనున్నట్లు ప్రకటించారు. శిలాతోరణం, చక్రతీర్థం అభివృద్ధి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణ అధ్యాయనానికి ఓ కమిటీ వేయనున్నట్లు- వివరించారు. శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసే విధంగా కో ఆర్డినేటర్ల నియామకానికి ఆమోదం తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు ఆమోదించారు. కల్యాణకట్టల వద్ద పారిశుద్ధం పెంపునకు, తిరుమలలో పరిపాలన భవనాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. పాత భవనాలని తొలగించి వాటి స్థానంలో నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని ఆమోదించారు. ఒంటిమిట్ట ఆలయంలో త్వరలోనే అన్నదానం ప్రారంభించనున్నారు. రూ. 4.7 కోట్లతో అన్నదానం కోసం నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 320 ఆలయాలకు మైక్ సెట్లు- ఇవ్వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 700 మంది వేద పారాయణదారుల నియామకానికి ఆమోదం తెలిపారు. ఇందుకోసం రూ.18కోట్ల నిధులు కేటాయించ నున్నారు. 600 మంది వేద పారాయణదారులకు నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ఆమోదించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఏపీలోని పలు దేవాలయాల వద్ద భజన మండలాల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ఒంటిమిట్ట రామాలయంలో ఆగస్టు నుంచి అక్కడ మూడు పూటలా భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. ఏఐ టెక్నాలజీ అమలుకు విధానపరంగా కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని బీఆర్ నాయుడు చెప్పారు. దీన్ని అధిగమించేందుకు రెండు ప్రముఖ సంస్థలు కసరత్తు చేస్తున్నాయన్నారు. త్వరలోనే ఏఐ సాంకేతికత అమలు చేసి భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పిస్తామని తెలిపారు. హిందూయేతర ఉద్యోగులపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని ఆయన చెప్పారు. అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని.. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తితిదే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్రీవారి దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈవో శ్యామలరావు తెలిపారు. ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు- నడకమార్గంలో వచ్చేవారికి మెరుగైన వసతులు కల్పిస్తాం. శిలాతోరణం, చక్రతీర్థం సమగ్రాభివృద్ధికి ఆర్కిటెక్చరల్ కన్సల్టెన్సీ నియామకంపై చర్చించాం. వసతి గదుల కోసం వేచి ఉండేవారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం చర్యలు చేపడతాం. తితిదే తరఫున ఆలయాల విస్తరణపై ఆలోచనలు చేస్తున్నాం. శ్రీవారి సేవకు సంబంధించి చాలా సంస్కరణలు తీసుకొస్తున్నాం. డిజిటల్, సోషల్ మీడియా ద్వారా భక్తులకు జరిగే మోసాలను నివారించే అంశంపై చర్చించాం. తితిదేలో 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్లను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఆమోదానికి పంపాలని నిర్ణయించామని తెలిపారు. తిరుమలలో భక్తుల వేచి ఉండేందుకు అనువైన నిర్మాణాలు ఎలా చేయాలనే దానిపై కన్సల్టెన్సీని నియామకం చేపడతాం అన్నారు. ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన ప్రాంతాల్లో మూడు కేటగిరీల్లో భజన మందిరాలు నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు విడుదల చేస్తాం. కడపలో వేల సంవత్సరాల చరిత్ర గల శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని ఈవో తెలిపారు.

# అగ్గిరాజేస్తున్న కామెంట్స్

హైదరాబాద్,భారతీయ జనతా పార్టీలో ఇద్దరు కీలకనేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కేంద్ర హెూం శాఖ సహాయమంత్రి బిజెపి నేత బండిసంజయ్ హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే,మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటుంది. తాజాగా ఈ ఇద్దరూ నేతలు మీడియా ముందుకు వచ్చి ఒకరిపై ఒకరు అసంతృప్తిని వెళ్ళగక్కుతుండటం చర్చగా మారింది. మొన్నటి వరకు అంతర్గతంగా ఉన్న విభేధాలు ఇప్పుడు బహిర్గతమవ్వడంతో ఈ ఎపిసోడ్ ఏటు దారి తీస్తుందోనని కార్యకర్తలలో అందోళన వ్యక్తం అవుతోంది.

హుజురాబాద్‌ను బేస్ చేసుకుని ఈటల, బండి మాటల యుద్ధం

తెలంగాణ బీజేపీ నేతల దృష్టి అంతా హుజరాబాద్ పై ఫోకస్ అవుతుంది. ఒకేసారి బండి సంజయ్. ఈటల రాజేందర్, హుజురాబాద్‌ను బేసె చేసుకుని ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటు ఉండటంతో నేటి రాజకీయాలే కేంద్ర సర్కిల్స్ లో ఉత్కంట రేపుతున్నాయి. కేంద్ర శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సైకిళ్ల పంపీణిలో భాగంగా హుజురాబాద్ కు వెళ్లారు అక్కడే గ్రూపు రాజకీయాల గురించి మాట్లాడారు ఏవరైన గ్రూపులను ప్రోత్సహిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ రాదని కరాకండిగా చేప్పారు.

హుజురాబాద్ బీజేపీ ఇన్చార్జ్‌గా ఈటల వర్గీయుడి రాజీనామా

సంజయ్ మాట్లాడిన కొన్ని గంటల్లోనే ఈటల వర్గీయుడి హుజురాబాద్ బీజేపీ గో కన్వీనర్ గౌతమ్ రెడ్డి పార్టికి రాజీనామా చేశారు. తర్వాత మరో 24 గంటల్లో సమావేశం నిర్వహించుకోని పార్టీల వర్గీయుల శామీర్ పేటలోని ఈటల నివాసానికి తరలి వెళ్లారు. హుజురాబాద్ పరిణామాలు దృష్టిలో పెట్టుకోని బండి సంజయ్ పై ఈటలపై పరోక్షంగా తీవ్ర విమర్శలు చేశారు. 2002లో జిల్లాకు వచ్చారు. మంత్రిగా పనిచేశారు. అడుగుపెట్టని గ్రామం లేదంటూ విమర్శలు గుప్పించారు.

ఈటల వర్గీయులకు ప్రాధాన్యత ఇచ్చామంటున్న సంజయ్ వర్గం

ఈ విమర్శలు తర్వాత సంజయ్ వర్గీయులు ఎలాంటి కామెంట్ చేయలేదు. అయితే హుజురాబాద్ నియోజకవర్గంలో ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చింది ఈటల అనుచరులకే అంటూ కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మనసులో ఏదో పెట్టుకుని తమను బదానం చేయడం తగదని సంజయ్ తెగ ఫీలైపోతున్నారు. ఈ క్రమంలోనే ఈటల మాట్లాడిన వీడియో టేప్స్ హుజురాబాద్‌లో ఈటల వర్గీయులకు ఎక్కడెక్కడ పార్టీ పదవుల దక్కయో అన్న విషయాన్ని కూడా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాడానికి రెడి అవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఈలాంటి పరిణామాలు ట్రోల్ చేసుకుంటు ఉండటం కాశాయ శ్రేణులను గందోరగోళ పరుస్తుందట.

ఈ వ్యవహారంపై మాట్లాడవద్దని రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు

ఇద్దరు ముఖ్యనేతల రాజకీయ విమర్శలు ఎటూ దారితీస్తాయోనని కార్యకర్తాల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై మాట్లడవద్దని రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది.

# రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష వంటివే..



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు ప్రస్తుతం ఒక కీలకమైన దశలో ఉన్నాయి. గత దశాబ్దంలో ఆధిపత్యం వహించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పలుకుబడి తగ్గుముఖం పట్టడం, కాంగ్రెస్ అధికారం లోకి రావడం, బీజేపీ రాష్ట్రంలో ఒక ప్రధాన శక్తిగా ఎదగడంతో రాజకీయ సమీకరణలు సరికొత్త రూపం సంతరించుకున్నాయి. ఈ త్రిముఖ పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ప్రజలకు ఎక్కువ రాజకీయ ప్రత్యామ్నాయాలను అందిస్తూ, పార్టీల బాధ్యతను పెంచే అవకాశం ఉంది. అదే సమయంలో అస్థిరతకు దారితీసే ప్రమాదం కూడా ఉంది.పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు తెరదించి, తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఒకవైపు ప్రజాకర్షక పథకాలతో ముందుకు దూసుకెళ్తుంటే, మరోవైపు అంతర్గత, బాహ్య సవాళ్లు కూడా ఆ పార్టీకి ఎదురవుతున్నాయి. అధికార బలం ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండటం కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద బలం. ప్రభుత్వ యంత్రాంగం చేతిలో ఉండటంతో విధానపరమైన నిర్ణయాలు వేగంగా తీసుకోవడానికి, ప్రజలకు నేరుగా చేరువ కావడానికి అవకాశం లభించింది.

ప్రజా పాలన బాటలో కాంగ్రెస్

ఎన్నికల విజయానికి మూలస్తంభమైన ఆరు గ్యారెంటీల అమలును ప్రభుత్వం వేగవంతం చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ఇప్పటికే ప్రారంభించి ప్రజల్లో సానుకూలతను నిలుపు కుంటోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన కార్య క్రమాలతో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారనే భావన కల్పిస్తున్నారు. ఆరు గ్యారెంటీల పూర్తిస్థాయిలో అమలు, కాంగ్రెస్ ప్రతిష్టకు అత్యంత కీలకం. అయితే కాంగ్రెస్ పార్టీకి సహజంగా ఉండే అంతర్గత కుమ్ములాటలు తెలంగాణలోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అసలైన కాంగ్రెస్ నేతలు, వలస వచ్చిన నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టుల పంపకాల విషయంలో సీనియర్లలో అసంతృప్తి ప్రభుత్వ స్థిరత్వానికి సవాలుగా మారవచ్చు.బీఆర్ఎస్ నుండి గెలిచిన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు కాంగ్రెస్‌లో చేరడం పార్టీకి సంఖ్యాబలాన్ని పెంచుతున్నా, వారిని సంతృప్తి పరచడం పెద్ద సమస్యగా మారింది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మొదటి అసలైన పరీక్ష. ఈ ఎన్నికల్లో గెలుపు, ప్రభుత్వ పని తీరుపై ప్రజల తీర్పుగా భావించబడుతుంది. ఈ ఎన్నికలే కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలకు దిక్సూచిగా నిలవనున్నాయి.

ప్రమాదంలో బీఆర్ఎస్ భవిష్యత్తు

తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలుగొందిన బీఆర్ఎస్, ప్రస్తుతం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. వరుస ఓటములు, అంతర్గత కలహాలు, న్యాయపరమైన చిక్కులు పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తు న్నాయి. వరుస ఓటములు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికా రం కోల్పోవడం, ఆ తర్వాత 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోవడం బీఆర్ఎస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాయి. ఈ ఓటములతో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లో కొంత ఒత్తిడి నెలకొంది. పార్టీ శ్రేణుల్లో నిరాశ, ఓటముల తర్వాత చాలా మంది సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీకి దూరంగా ఉండటం ఇతర పార్టీలలోకి వెళ్లడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను బీఆర్ఎస్ తమ పునరుజ్జీవానికి ఒక అవకాశంగా భావిస్తోంది.

ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష వంటివే..

క్షేత్రస్థాయిలో పార్టీకి ఇంకా పట్టు ఉందని, ఈ ఎన్నికల్లో గెలిచి బలాన్ని నిరూపించుకోవాలని ఆశిస్తోంది. అయితే, పార్టీలోని అంతర్గత కలహాలు ఈ అవకాశాలకు గండి కొట్టేలా ఉన్నాయి. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం వంటి అంశాలపై తీవ్ర ఆరోపణలు బీఆర్ఎస్‌పై నైతికంగా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా పార్టీ ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను హరించిన, సొంత నాయకులను నమ్మని పార్టీగా ముద్రపడే ప్రమాదం ఉంది. తదుపరి విచారణ ఫలితాలు బీఆర్ఎస్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపవచ్చు. అయితే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక అగ్నిపరీక్ష లాంటివి. ఈ ఎన్నికల ఫలితాలే తెలంగాణలో పార్టీ భవిష్యత్తును నిర్దేశించనున్నాయి.

బీఆర్ఎస్ బలహీనతే బీజేపీ బలం

గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ బీజేపీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయినప్పటికీ, 2024 లోక్‌సభ ఎన్నికలలో 8 స్థానాలు గెలుచుకొని, అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో సమానంగా నిలిచి సంచలనం సృష్టిం చింది. ఈ విజయం, ఓట్ల శాతంలో గణనీయమైన పెరుగుదలతో పాటు, పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ ప్రదర్శన బీజేపీని రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బలమైన ప్రత్యామ్నాయంగా స్థిరపరచడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, అంతర్గత సవాళ్లు పార్టీ పురోగతికి అడ్డంకులుగా మారుతున్నాయి. నాయకత్వ విభేదాలు, సంస్థాగత సమన్వయ లోపాలు, స్థానిక నాయకుల మధ్య పోటీలు వంటి సమస్యలు బీజేపీని కలవరపరుస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ క్రమంగా బలహీనపడటం బీజేపీకి రాజకీయంగా కలిసి వస్తోంది. బీఆర్ఎస్ స్థానాన్ని ఆక్రమించి, కాంగ్రెస్‌కు ఏకైక, బలమైన ప్రత్యామ్నాయంగా నిలవడానికి బీజేపీకి మార్గం సుగమమైంది.తెలంగాణలో బీజేపీకి కొన్ని పట్టణ ప్రాంతాలు, కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే బలమైన స్థానం ఉంది, కానీ గ్రామస్థాయిలో బలమైన కేడర్ వ్యవస్థ ఇంకా ఏర్పడలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి ఇది ప్రధాన కారణాల్లో ఒకటిగా చెప్పవచ్చు. రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు నియామకం వల్ల కలిగిన అసంతృప్తి వంటి అంశాలు పార్టీ ఐక్యత, భవిష్యత్ విజయాలకు అడ్డంకులుగా ఉన్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ భవిష్యత్ ప్రస్థానానికి ఒక లిట్మస్ టెస్ట్‌గా నిలుస్తాయి.

# తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ఫలితాలు రిలీజ్ అయ్యాయి. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా సచివాలయంలో ఫలితాలను విడుదల చేశారు. జూన్ 18 నుంచి 30వ తేదీల మధ్య ఆన్‌లైన్ మోడ్‌లో పరీక్షలు జరిగాయి. టెట్ పరీక్షకు మొత్తం 1,37,429 మంది హాజరయ్యారు. కాగా, కేవలం 33.98 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 30,649 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.

# శేషప్రశ్నగా ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారం!

న్యూఢిల్లీ,పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే..అనూహ్యంగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం సహజంగానే ఆశ్చర్యాన్ని కలిగించడమే కాకుండా...అనుమానాలను రేకెత్తించింది. బెంగాల్ గవర్నర్‌గా ఆయన పనితీరును ప్రశంసించిన మోడీ అనూహ్యంగా ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. వెంకయ్యానాయుడు పదవీకాలం ముగియగానే పొడిగించమో లేదా..రాష్ట్రపతిగా ప్రమోషన్ ఇవ్వడమో జరుగుతుందని అంతా అనుకున్నారు. అయితే అవేవీ జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత అన్నీ అనూహ్యాలే జరుగుతున్నాయి. అద్వానీని రాష్ట్రపతిని చేస్తారని అంతా భావించారు. బిజెపి శ్రేణులు గట్టిగా నమ్మారు. కానీ రామ్‌నాథ్ కోవింద్‌ను తెరపైకి తెచ్చి అద్వానీని అవమానించారు. ఈ దేశానికి ప్రధాని కావాలని గట్టిగా నమ్మి పార్టీ కోసం కృషి చేసిన అద్వానీకి మోడీ అడ్డుపడ్డాడు. ఆతరవాత రాష్ట్రపతిని చేస్తారని అనుకుంటే...అప్పుడు కోవింద్ తెరపైకి వచ్చారు. ఇక అద్వానీ శకం ముగిసింది. మురళీమనోహర్ జోషి శకం ముగిసింది. పాతతరంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో ఉన్నారు. వెంకయ్యానాయుడును పార్టీ నుంచి తప్పించే క్రమంలో ఉపరాష్ట్రపతిని చేసి, ఆ తరవాత ఆయనను ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు ధన్‌ఖడ్ రాజీనామా కూడా అనూహ్యమే అయినా మోడీ వ్యూహం ఉండేవుంటుంది. పార్లమెంటు ప్రారంభంకావడం, తొలిరోజే అనూహ్యంగా విపక్షాలు వివిధ అంశాలపై చర్చకు పట్టుబట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్న ఉదయిస్తోంది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజీనామాను ఆమోదించారు. ఈ మేరకు ఫైల్‌పై సంతకం చేశారు. కాగా, గత రాత్రి అనూహ్యంగా జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. కానీ, ఈ రాజీనామాకు అసలు కారణం అనారోగ్యం కాదని పలువురు రాజకీయ నేతలు అంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయ న్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు- పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు.విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన



వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖఢ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది.ఓ న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభించడం, కేంద్ర ప్రభుత్వంతో వివాదం, రాజ్యసభలో జరిగిన కొన్ని సంఘటనలు దన్‌కడ్ రాజీనామా వెనక ఉన్నాయని చెబుతున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ యశ్వంత్ వర్మ అనే న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభ్యం కావడంతో ఈ వివాదం మొదలైంది. ఈ సంఘటన తర్వాత విపక్ష పార్టీలు రాజ్యసభ లో జస్టిస్ వర్మను తొలగించేందుకు ఒక నోటీసును ప్రవేశపెట్టాయి. రాజ్యసభ అధ్యక్షుడిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ ఈ నోటీసును ఆమోదించి, రాజ్యసభ కార్యదర్శికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నచ్చలేదని తెలుస్తోంది. విపక్షాలు ప్రవేశపెట్టిన ఈ నోటీసును ఆమోదించడం ద్వారా, న్యాయవ్యవస్థలో అవినీతిపై కేంద్రం నేరుగా చర్యలు తీసుకునే అవకాశాన్ని ధన్‌ఖర్ తప్పించారని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ విషయంపై కేంద్రంతో విభేదాలు వచ్చాయని పుకార్లు కూడా వచ్చాయి. ఈ సంఘటన తర్వాత ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు మొదల య్యాయని తెలిసింది. ఆరు నెలల క్రితం కూడా విపక్షాలు ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. అయితే, ఈసారి కేంద్రం నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా, ధన్‌ఖర్ అవమానకరమైన అవిశ్వాస తీర్మానానికి బదులు రాజీనామా చేయడాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం రాత్రి 9:25 గంటలకు ఉప రాష్ట్రపతి అధికారిక ఎక్స్ ఖాతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖను పోస్ట్ చేశారు. తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు- లేఖలో తెలిపారు. ఇది వెంటనే అమల్లోకి వచ్చేలా భారత ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో తన పదవీ కాలంలో సహకరించిన వారికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, ప్రధానమంత్రి, రాజ్యసభ సభ్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇవన్నీ బయటకు కనిపిస్తున్న కారణాలే అయినా ఇంకా ఇతరత్రా ఏ కారణాలు ఉన్నాయన్నది కాలక్రమంలో తెలుస్తుంది. అయితే ధన్‌ఖడ్ మోడీకి ఇష్టమైన వ్యక్తిగా అనూహ్యంగా దూసుకుని వచ్చి..అంతే అనూహ్యంగా రాజీనామా చేసి వెళ్లిపోవడమనే చర్య మాత్రం అనుమానాలను రేకెత్తిస్తూనే ఉంటుంది.

# నిధులు దోచుకుని...ప్రజల ప్రాణాలు మింగేశారు

అమరావతి: మద్యం నిషేధిస్తామని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చి ఏం చేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఏరులై పారించిందని ఆరోపించారు. మద్య నిషేధం నినాదంతో అధికారంలోకి వైసీపీ వచ్చిందని.. కానీ ఆ హామీని జగన్ మర్చిపోయారని మండిపడ్డారు. అనేక మందికి నాసిరకం మద్యంతో లివర్ దెబ్బ తిని ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు.మంగళవారం పవన్ మీడియతో మాట్లాడుతూ.. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారని.. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులు తినేశారు.. మరోవైపు జనం ప్రాణాలు తీశారని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. అయినా ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలు చేసి ఇక్కడ నిలబడ్డామని... ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహరించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించు కోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..అని ప్రశ్నించారు. ఇక్కడ ఎవరూ అంత తేలికగా లేరని పవన్ కల్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్నిఇప్పటికే సీఎం చంద్రబాబుకి చెప్పానని.. సీఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లను కూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని చెప్పానని.. అందుకు సీఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహరిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సీఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సీఎంకు చెప్పిన అనంతరేమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## బిజెపిది బిసి వ్యతిరేక వైఖరి

హైదరాబాద్,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అసాధ్యం అనడం బీజేపీ అసలు స్వరూపాన్ని బయటపెడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బిజెపి మాట్లాడుతున్న తీరు దాని బిసి వత్యిరేకతను బయటపెట్టిందన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో ఇదే విధమైన రిజర్వేషన్లు అమలు అయ్యాయి. సుప్రీంకోర్టు ఇందిరా సహనీ కేసులో స్పష్టంగా చెప్పింది రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ప్రమాణితమైన సమాచారం, ఎంపెరికల్ డేటా ఉంటే వారు రిజర్వేషన్ నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం సర్వే చేసింది, కేబినెట్ ఆమోదం తీసుకుంది, శాసనసభ ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదంతో అది ఇప్పుడు ఢిల్లీలో ఉంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు రిజర్వేషన్ల కోసం రాజీనామా చేయాలి. నిజంగా బీసీల పక్షాన నిలబడాలని ఉంటే, రిజర్వేషన్లు అమలయ్యేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చూపాలి. లేకపోతే బీసీల పట్ల కుట్ర చేస్తూ ఉంటారని భావించాలని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. అనాడు మండల కమిషన్‌ను వ్యతిరేకించింది బీజేపీయే. ఇప్పుడు మళ్లీ బీసీల రిజర్వేషన్లపై వక్రబుద్ధిని చూపిస్తోంది. తెలంగాణలోని అన్ని బీసీ సంఘాలు ఈ కుట్రను గమనించి రిజర్వేషన్ హక్కులను కాపాడేందుకు ముందుకు రావాలని పొన్నం పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల పక్షాన నిలుస్తున్నారు. మా పీసీసీ అధ్యక్షుడు కూడా బీసీ వర్గానికే చెందినవారు. మా వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. అదే సమయంలో, బీజేపీపై విరుచుకుపడుతూ, మీరు ముఖ్యమంత్రి బీసీ అని, సిఎల్పీ నాయకుడు బీసీ అని మభ్యపెడతారు. కానీ పార్టీ అధ్యక్ష పదవిని బీసీ వర్గానికి ఇవ్వని మీరు, మళ్లీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారు. ఇది మీ అసలు స్వరూపం అని మంత్రి ఆరోపించారు.

# కాకరేపుతున్న రాజకీయం!

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు గత కొన్నాళ్లుగా బీసీ రిజర్వేషన్ల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రభుత్వ పక్షం కాంగ్రెస్.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు రెడీ అయింది. అది కూడా స్థానిక సంస్థల ఎన్నికల నుంచే అమలు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన బిల్లును కూడా అసెంబ్లీలో పాస్ చేసి.. రాష్ట్రపతికి పంపింది. అయితే..అక్కడ నుంచి రిప్లయ్ రాకపోవడంతో గవర్నర్‌కు పంపించి.. ఆర్డినెన్సు ద్వారా అయినా.. ఈ రిజర్వేషన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. కానీ.. గవర్నర్‌కు పంపించి.. సుమారు వారం రోజులు అయినా.. రాజ్‌భవన్ కూడా మౌనంగా ఉంది.దీనిపై అధికార పార్టీలో చర్చ సాగుతోంది. ఇక, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ దీనిపై ఆచి తూచి వ్యవహరిస్తోంది. బీసీలకు రిజర్వే షన్లు కల్పించాలని బలంగా చెప్పలేక పోతోంది. చెప్పినా.. సర్కారుపై విమర్శలు చేస్తోంది తప్ప.. చిత్తశుద్ధి కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీనికి కారణం పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోలేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నా యి. కాంగ్రెస్ ఈ విషయంలో బలంగా ఎదురు దాడి చేస్తోంది. అయితే.. బీఆర్ ఎస్‌లో ఇతర నాయకులు ఎలా ఉన్నా.. ఎమ్మెల్సీ కవిత మాత్రం కొంత జోరుగానే స్పందిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నిరసనగా రైల్ రోకోకు పిలుపునిచ్చినా.. సరైన మద్దతు కొరవడంతో వెనక్కి తగ్గారు.కట్ చేస్తే.. బీజేపీ ఇప్పుడు సంచలన ప్రకటన చేసింది. అసలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తాము సంపూర్ణంగా వ్యతిరేకమని పార్టీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ప్రకటించారు. 50 శాతం రిజర్వేషన్లు మించకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని.. ఇప్పటికే 10 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు కేటాయించారని.. అలాంటప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటే.. ఇది పక్కా మోసమని.. ప్రజలను మాయ చేస్తున్నారని.. దీనిలో బీజేపీ భాగస్వామ్యం కాబోదని తేల్చి చెప్పారు. ఈ క్రమంలోనేతాము.. దూరంగా ఉంటున్నామన్నారు.అంతేకాదు.. దీనిని షెడ్యూల్ 9(తమిళనాడు మాదిరిగా)లో చేర్చే ప్రసక్తి లేదన్నారు. ఇది రాజకీయ రిజర్వేషన్ల వ్యూహమని.. దీనిలో తాము భాగస్వామ్యం కాబోమని వెల్లడించారు. అయితే.. బీజేపీ చేసిన ప్రకటన రాజకీయంగా ఆ పార్టీని ఇరుకున పెట్టే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే.. తెలంగాణ వ్యాప్తంగా రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్న సమయంలో బీజేపీ ఉన్నట్టుండి ఇలా ప్రకటించడంపై సొంత పార్టీ నాయకులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది సుదీర్ఘ కాలంలో బీజేపీని ఇబ్బందుల్లోకి నెడుతుందని

# జేడీయూకు ఉప రాష్ట్రపతి...టీడీపీకి డిప్యూటీ స్పీకర్ ?



న్యూఢిల్లీ,కేంద్రంలో బీజేపీ ఆచీ తూచీ అడుగులు వేస్తోంది అని అంటున్నారు. మ్యాజిక్ ఫిగర్ కి చాలా దూరంలో ఆగిపోయిన బీజేపీకి ఆదుకుంటున్నది ఊత కర్ర సాయం అందిస్తోంది ఏపీ నుంచి తెలుగుదేశం పార్టీ, బీహార్ నుంచి జేడీయూ అన్నది తెలిసిందే. అందుకే ఈ రెండు పార్టీలకు ఎన్డీయే పెద్దలు ఎక్కడ లేని విలువ ఇస్తున్నారు.ఇదిలా ఉంటే జేడీయూకి ఉప రాష్ట్రపతి పదవి దక్కబోతోంది అని అంటున్నారు. ఆ పార్టీకి ఇది అతి పెద్ద గౌరవంగా ఉంటుంది. అంతే కాదు ప్రాధాన్యత కూడా చాలా పెరిగినట్లే అని అంటున్నారు. జేడీయూ అధినేత నితీష్ కుమార్ అవసరం బీజేపీకి చాలా ఉంది. బీహార్ లో ఇపుడు రాజకీయం ఎన్డీయేకు ఏమంత సుఖంగా లేదు. విపక్షాలు గట్టిగానే సవాల్ చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో జేడీయూని తమతో ఉంచుకోవడం బీజేపీకి అత్యవసరంగా మారుతోంది. ఈ క్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవిని బహుమానంగా ఇస్తున్నారు అని అంటున్నారు. దీని వల్ల నితీష్ కుమార్ కూటమికి కట్టుబడి ఉంటారని అంటున్నారు. ఎందుకంటే ఎన్నికల ముందు కూటములు వేరు, ఎన్నికల తరువాత రాజకీయ సన్నివేశాలు వేరు.బీహార్ లో ఇలాంటివి చాలా జరిగాయి. పైగా గత అయిదేళ్ళలో నితీష్ రాజకీయ విన్యాసాలు దేశమంతా చూసింది. 2020లో బీజేపీతో ఎన్డీయేతో కలసి గెలిచి మధ్యలో ఇండియా కూటమికి వెళ్ళారు మళ్ళీ అటు నుంచి ఇటు మళ్ళారు. మరి బీహార్ లో అంకెల గారడి ఏలా ఉంటుందో తెలియదు బొటాబొటీగా నంబర్ వస్తే నితీష్ కుమార్ అత్యంత కీలకం అవుతారు. అందుకే ఆయన ముందర కాళ్ళకు బంధం వేసేందుకు బీజేపీ ఈ విధంగా దేశంలోనే అతి పెద్ద రెండవది అయిన రాజ్యాంగ పదవిని అందిస్తోంది అని అంటున్నారు.మరో వైపు ఏపీలో టీడీపీని చంద్రబాబుని అలాగే చూసుకుంటున్నాబు. చంద్రబాబు వరకూ చూస్తే ఆయన పదవుల విషయంలో పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. కేంద్రం దండీగా నిధులు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. అయితే గ్రాంట్స్ విషయంలో అనుకున్నంతగా సాయం అందిస్తోందా లేదా అన్నది పక్కన పెడితే పదవుల విషయంలో మాత్రం బీజేపీ తెలుగుదేశానికి న్యాయం చేస్తోంది అని అంటున్నారు.ఇప్పటికే ఒక గవర్నర్ పదవిని ఇచ్చిన బీజేపీ రానున్న కాలంలో మరో గవర్నర్ పదవిని ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. అంతే కాదు లోక్ సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని టీడీపీకి ఇస్తారు అని ప్రచారం అయితే సాగుతోంది. ఆ పదవిని అమలాపురానికి చెందిన మాజీ స్పీకర్ గంటి మోహన చంద్ర బాలయోగి కుమారుడు కి దక్కుతుందని చెబుతున్నారు. మొత్తానికి నితీష్ ని చంద్రబాబుని ప్రసన్నం చేసుకోవడంలో బీజేపీ సక్సెస్ అవుతోందని చెబుతున్నారు.

# బీహార్ రాజకీయాల్లో ధన్‌ఖడ్ దుమారం!




పాట్నా:ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా దేశ వ్యాప్తంగా సృష్టించిన రాజకీయ ప్రకంపనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇంకా కొనసాగడం కాదు, మరింతగా ఉధృతం అవుతున్నాయి. జాతీయ స్థాయి నుంచి రాష్ట్రాలకు విస్తరిస్తున్నాయి. ఓ వంక రాజకీయ విశ్లేషకులు వివిధ కోణాల్లో విశ్లేషణలు చేస్తుంటే, మరో వంక రాజకీయ విమర్శల దుమారం రేపుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ఆచి తూచి అడుగులు వేస్తోంది. ఒక్క జై రామ్ రమేష్ మినహా మరో ముఖ్య నాయకుడు ఎవరూ, ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా అంశం పై స్పందించలేదు. జై రామ్ రమేష్ కూడా.. ధన్‌ఖడ్ రాజీనామాకు ఆరోగ్య సమస్యలు అసలు కారణం కాకపోవచ్చనీ, రాజకీయ కారణాలు ఉండి ఉండవచ్చన్న అనుమానం మాత్రమే వ్యక్త పరిచారు. అయితే.. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్ లో ధన్‌ఖడ్ రాజీనామా రాజకీయ దుమారం రేపుతున్నది. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా వెనుక బీజేపీ కుట్ర ఉందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) సంచలన ఆరోపణ చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ ను మార్చేందుకే ఇలా చేసినట్టు ఆర్జేడీ చీఫ్ విప్ అఖ్తరుల్ ఇస్లామ్ షహీన్ అన్నారు.చాలాకాలంగా నితీష్ కుమార్‌కు ఉద్వాసన చెప్పేలా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారనీ,ఒక దశలో నితీష్‌ను ఉప ప్రధానిని చేయాలని కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్ చౌబే సూచించారని గుర్తు చేశారు. ఈ దశలో జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడం వెనుక బీజేపీ కుట్ర కనిపిస్తోందని అన్నారు. ఉపరాష్ట్రపతి వంటి రాజకీయ ప్రాధాన్యత లేని పదవిని ఇచ్చి నితీష్‌ను సీఎం పదవి నుంచి తప్పించాలని బీజేపీ భావిస్తోందన్నారు. అయితే.. ఆర్జేడీ నేత ఆరోపణలను జేడీయూ సీనియర్ నాయకుడు శరవణ్ కుమార్ తోసిపుచ్చారు. నితీష్ కుమార్ బిహార్‌ను విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఆయన ఇక్కడే ఉంటారని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయానికి సారథ్యం వహిస్తారని, రాష్ట్ర ప్రజలకు మరో ఐదేళ్ల సేవలందిస్తారని చెప్పారు. అయితే.. ఆర్జేడీ నేత చేసిన ఆరోపణలో నిజం లేక పోలేదు. పాతికేళ్లకు పైగా బీజేపీ బీహార్ ముఖ్యమంత్రి పీఠం పై ఆశలు పెట్టుకుంది. అప్పటి నుంచి తమ ఆశలకు అవరోధంగా నిలిచిన నితీష్ కుమార్ అడ్డు తొలిగించుకోవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తూనే వుంది. అంతే కాకుండా, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధించింది. అయితే.. బీజేపీ కంటే ఐదు ఎక్కువగా 115 స్థానాల్లో పోటీ చేసిన ఎన్డీఏ ప్రధాన భాగస్వామ్య పక్షం జేడీయూ కేవలం 43 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. మరోవంక 110 స్థానాలకు పోటీచేసిన బీజేపీ 74 సీట్లు గెలుచుకుంది.అయినా, ఎన్నికలకు ముందు కుదిరిన ఒప్పందం ప్రకారం, బీజేపీ జేడీయూ నేత నితీష్ కుమార్ కు ముఖ్యమంత్రి పదవిని ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే.. ఈసారి ముందుగా ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీష్ కుమార్ పేరును ప్రటించేందుకు ముందు నుంచి బీజేపీ అభ్యతరం వ్యక్తం చేస్తోంది. అయితే.. ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీష్ కుమార్ పేరు ప్రకటించినా, ప్రకటించక పోయినా, ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా వస్తే ముఖ్యమంత్రి కుర్చీని ఎట్టి పరిస్థితిలో వదులుకోరాదని, బీజేపీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోందనే చర్చ ధన్‌ఖడ్ రాజీనామా ఎపిసోడ్ కంటే ముందు నుంచి సాగుతోంది. ఈ నేపథ్యంలో.. ధన్‌ఖడ్ రాజీనామా బీజేపీ బీహార్ వ్యూహంలో భాగం అయినా కాకపోయినా వెదుకుతున్న తీగ కాలికి తగిలింది అన్నట్లుగా కలిసొచ్చిన అవకాశాన్ని కమల దళం వినియోగించుకునే అవకాశం లేక పోలేదని విశ్లేషకులు అంటున్నారు. అందుకే.. ధన్‌ఖడ్ రాజీనామా ప్రకటన వెలువడిన వెంటనే, బీజేపీ ఎమ్మెల్యే హరిభుషణ్ ఠాకూర్.. నితీష్ కుమార్ ఉపరాష్ట్రపతి అయితే.. దేశానికీ, రాష్ట్రానికి కూడా మంచిదని అన్నారు. అలాగే ఇతర బీజేపీ రాష్ట్ర నాయకులు కూడా ఉప రాష్ట్రపతి రేసులో నితీష్ ను తెచ్చి నిలబెట్టారు. అయితే.. ప్రస్తుతానికి అయితే నితీష్ కుమార్ రాజకీయ అస్త్ర సన్యాసం చేసేందుకు సిద్దంగా లేరు. అలాగే.. జేడీయు కూడా సీట్లు ఓట్లతో సంబంధం లేకుండా నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్న ప్రచారం ప్రారంభించింది. మరో వంక నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా తానే కొనసాగుతానని చెప్పకనే చెపుతున్నారు. నిరుద్యోగ యువతకు ఐదేళ్లలో కోటి ఉద్యగాలు సహా .. అన్ని వర్గాలను ఆకట్టుకునేందుకు హామీలు కురిపిస్తునారు. ఈ నేపథ్యంలో.. ఎన్నికలకు ముందు నితీష్ కుమార్ బీహార్ వదిలి పోక పోవచ్చని,అంటున్నారు. అంటే బీహార్ ఎన్నికల క్రతువు ముగిసే వరకు ఉపరాష్ట్రపతి ఎన్నికను వాయిదా వేయగలిగితే ఏమో కానీ.. లేదంటే, బీజేపీ ఆశలు మరోమారు ఆవిరి అయినట్లే అంటున్నారు.

# కేఏ పాల్ సామాన్యుడు కాదా...నిముష ప్రియ మ్యాటర్ లో !



న్యూఢిల్లీ,కేఏ పాల్ అంటే అంతా ఒక విధంగా హాస్యంగా చూస్తారు. ఆయన ఏమి మాట్లాడినా జోక్ గానే తీసుకుంటారు. కానీ పాల్ మాత్రం సీరియస్ గానే అన్ని విషయాలు చెబుతారు. ఆయన ఒక డేటాని తన వద్ద ఉంచుకునే మీడియా సమావేశాలు పెడుతూంటారు. ఆయన నేను ఫలానా వారిని కలిశాను ఆయన తెలుసు అని పెద్ద నాయకుల గురించి చెబుతూంటే ఏమో కామెడీ అని అంతా అనుకుంటారు.కానీ యెమెన్ లో జైలులో ఉన్న కేరళ నర్సు నిమిష ప్రియ విషయంలో ఆయన సీరియస్ గానే ప్రయత్నాలు చేశారు అని అంటున్నారు ఆయన తాజాగా యెమెన్ రాజధాని సనా నుంచి ఒక వీడియో సందేశం భారత్ కి పంపించారు. అందులో నిముష ప్రియ సేఫ్ అని చెప్పారు. ఆమె మరణ శిక్ష రద్దు అయింది. ఇక ఆమె క్షేమంగా భారత్ తిరిగి వస్తుందని చెప్పారు.ఆమె మరణ శిక్షను యెమెన్ ప్రభుత్వం రద్దు చేసిందని కేఏ పాల్ ప్రకటించారు. యెమెన్ రాజధాని సనా జైలు నుంచి నిమిష ప్రియ త్వరలో విడుదల అవుతుందని కూడా చెప్పారు. ఆమెని ఉరి శిక్ష నుంచి తప్పించే విషయంలో తాను గత పది రోజులుగా రాత్రి పగలూ కష్టపడ్డాను అని సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ఆయన పోస్టు చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు.తన ప్రయత్నాలకు యెమెన్ అధికారులు భారత ప్రభుత్వం ఎంతో సహకరించాయని ఆయన చెప్పుకొచ్చారు. తాను చేసిన కృషి ఫలించిందని ఆయన అన్నారు. ఇక నిమిష ప్రియను క్షేమంగా భారత్ కి తీసుకుని వెళ్ళడానికి భారత్ దౌత్య అధికారులు పంపించేందుకు అంగీకరించింది అని ఆయన అన్నారు.నిజానికి నిమిష ప్రియ విషయం చాలా క్లిష్టతరంగా మారింది. ఒకానొక టైం లో ఆమె మరణం ఖాయమని అనుకున్నారు. కేంద్రం సైతం సుప్రీం కోర్టులో ఈ వ్యాజ్యం మీద మాట్లాడుతూ తాము చేయగలిగినంత చేశామని చెప్పుకొచ్చింది. అయితే ఆశ్చర్యకరంగా ఆమె ఉరి శిక్ష రద్దు అయింది.ఇపుడు చూస్తే ఆమె క్షేమంగా భారత్ వస్తోందని పాల్ చెబుతున్నారు ఆయన ఏకంగా యెమెన్ రాజధాని సనా నుంచి వీడియో చేయడంతో ఆయన సామాన్యుడు కాదని అంతా అంటున్నారు. కేఏ పాల్ గత కొన్నేళ్ళుగా తెలుగు ప్రజల దృష్టిలో ఒక విధంగా ఉంటూ వచ్చారు. కానీ ఇపుడు నిమిష ప్రియ కేసు కనుక సక్సెస్ అయితే మాత్రం కేఏ పాల్ గ్రేట్ అనే చెబుతారు అంతా.మరి ఆయన చేసిన దౌత్య పరమైన చర్యలు ఏమిటి అన్నది చూడాలి. ఒక ముస్లిం దేశంలో ఉరి శిక్ష వేయడం వరకూ ఓకే కానీ రద్దు కావడం ఆషామాషీగా జరగదు. అయితే కేఏ పాల్ గతంలో గ్లోబల్ పీస్ ఇనిషియేటివ్ అనే అంతర్జాతీయ సంస్థను నిర్వహించి అనేక దేశాలు తిరిగారు. ఆయనకు అన్ని చోట్లా పరిచయాలు అయితే ఉన్నాయని ఈ విషయంలో అంగీకరించాల్సి వుంది అంటున్నారు.

# 'ద్వారంపూడి' ద్వారాలకు పొలిటికల్ తాళం..!



అమరావతి,ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి. ఈ పేరుకు పెద్దగా పరిచయం అక్కర్లేదు. వివాదాస్పద వైసీపీ నాయకుల జాబితాలో తొలి ముగ్గురిలో ఈయన పేరు ఖచ్చితంగా ఉంటుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు.. నిరంతరం మీడియా ముందుకు వచ్చి.. జనసేనను టార్గెట్ చేసిన ద్వారంపూడి.. తర్వాత.. కాలంలో కూడా.. రెచ్చిపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత. కూడా తన ప్రాభవం తగ్గదని చెప్పారు. అయితే.. ఆ మాట అన్నా.. కూడా.. ఆయన ప్రాభవం ఎక్కడా కనిపించడం లేదు.ఎవరి నోటా.. ఇప్పుడు ద్వారంపూడి మాట వినిపించడం లేదు. కాకినాడ సిటీ నుంచి విజయం దక్కించుకున్న రెండు సార్లు కూడా ఆయన అప్రతిహతంగా రాజకీయాలు చేశారు. కానీ, గత ఏడాది కూటమి విజయం దక్కించుకోవడం.. ముఖ్యంగా పౌరసరఫరాల శాఖను జనసేన తీసుకున్న దరిమిలా.. ద్వారంపూడికి ప్రాణప్రదమైన రైస్ వ్యాపారం పై పెద్ద పిడుగే పడింది. ముఖ్యంగా రైస్ ఎగుమతులు.. మిల్లుల పై ఆయన ఆధిపత్యం దాదాపు పోయిందనే టాక్ వినిపిస్తోంది.ఒకప్పుడు రెండు గోదావరి జిల్లాల్లోనే కాదు.. పొరుగు రాష్ట్రం తెలంగాణలోనూ రైస్ బిజినెస్ అంటే.. ద్వారంపూడి పేరు వినిపించేది. కానీ, ఓడలు బళ్లు-బళ్లు ఓడలు అయినట్టుగా.. జనసేన విజయంతో చంద్రశేఖర్‌కు గ్రహణం పట్టుకుంది. ఇప్పుడు ఆయన పేరు కానీ..ఊరు కానీ.. వినిపించడం లేదు. వాస్తవానికి.. వైసీపీకి ఉన్న బలమైన వాయిస్ లలో కోడాలి నాని తర్వాత.. ఫ్లేస్ ద్వారంపూడిదే. దీంతో ఆయన పార్టీకి, అధినేత జగనకు కూడా అనుకూలంగానే ఉన్నారు. ఎప్పుడైతే.. ఆయన పవన్‌ను టార్గెట్ చేయడం ప్రారంభించారో.. అప్పుడే మైనస్ అయ్యారు.ఇప్పుడు పరిస్థితి ఏంటి? అంటే.. నియోజకవర్గంలో ద్వారంపూడి అనుచరులు కూడా కనిపించడం లేదు. ఒకప్పుడు వందల మంది ఆయన చుట్టూ ఉండేవారు. కానీ, ఇప్పుడు పట్టుమని పది మంది మాత్రమే కని పిస్తున్నారు. అంతేకాదు.. ఆయన ను సమర్థించే వ్యాపారులు కూడా చీలిపోయారు. దీంతో ద్వారంపూడి రాజకీయాలు దాదాపు బ్రేక్ వేసినట్టు ఆగిపోయాయని పరిశీలకులు చెబుతున్నారు. అయితే.. ఇది శ్వాశ్వతమా.. కాదా.. అనేది వచ్చే ఎన్నికల వరకు వెయిట్ చేయాల్సిందే. ఎందుకంటే.. రాజకీయాల్లో ఎప్పుడూ ఏదీ శాశ్వతం కాదు కదా!. అందుకే ద్వారంపూడికూడా వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. తన టైం కోసం ఎదురు చూస్తున్నారట.

# 'రప్పా.. రప్పా.. అంటే చూస్తూ కూర్చుంటామా'



అమరావతి,"మాట్లాడితే.. రప్పా రప్పా అంటూ బెదిరిస్తున్నారు. వారి తాకాటు చప్పుళ్లకు బెదిరేది లేదు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరు కుంటామా?" అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వైసీపీ నాయకులపై విరుచుకుపడ్డారు. తాము అనేక పోరాటాలు చేసి, ఉద్యమాలు నిర్మించి ఈ స్థాయికి వచ్చామని తెలిపారు. ప్రజలు తమను బలంగా అక్కున చేర్చుకున్నారని చెప్పారు. అలాంటి తమకు ఈ బెదిరింపులు ఒక లెక్కకాదని చెప్పారు. బెదిరింపు రాజకీయాలు చేసే వారికే గత పాలకులను ప్రజలు ఎక్కడ పెట్టారో ఇప్పుడు చూస్తున్నారన్నారు.తాజాగా మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడుతూ వైసీపీ హయాంలో లిక్కర్ కేసుపై స్పందించారు. 2019 ఎన్నికల ముందు రాష్ట్రంలో మద్యం నిషేధం చేస్తామని, విడతల వారీగా తగ్గిస్తామని చెప్పిన వారు విచ్చలవిడిగా ధరలు పెంచి ప్రజల సొమ్మును దోచుకున్నారని అన్నారు. "డబ్బు పోతే పోయింది. జనాలు కూడా చచ్చిపోయారే. నాసిరకం లిక్కర్‌ను అంటగట్టి లివర్, కిడ్నీ సమస్యలు వచ్చేలా చేసి చంపేశారే" అని పవన్ వ్యాఖ్యానించారు. మద్యం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ తరువాత ఏం చేశారని నిలదీశారు."మద్యం కుంభకోణంలో అంతమందిని అరెస్టు చేశారు. ఇంత మందిని అరెస్టు చేశారు అని చెబుతున్నారు. తప్పులు చేశారు కాబట్టే వారిని అరెస్టు చేశారు" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ప్రజల సొమ్మును, వారి ఆరోగ్యాన్ని కూడా దోచుకుని పీల్చి పిప్పిచేసిన వారిని ఏమి చేయాలని ప్రశ్నించారు. పైగా నంగనాచి కబుర్లు చెబుతున్నారంటూ ఎద్దేవా చేశారు. తప్పులు చేసి పైగా ఎదురు దాడి చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఈ పేపర్ పులులకి, తాటాకు చప్పుళ్లకి కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడేది లేదన్నారు. కేసు విచారణ ముమ్మరంగా సాగుతోందని పవన్ తెలిపారు. తప్పు చేసిన వారిని వదిలేది లేదని హెచ్చరించారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ ఛార్జ్ షీట్ .. దిమ్మతిరిగే నిజాలు వెలుగులోకి



అమరావతి,మద్యపాన నిషేధం అమలు చేస్తానంటూ అధికారంలోకి వచ్చిన జగన్.. తన ఐదేళ్ల పాలనలో ఏకంగా మద్యం కుంభకోణం చేసి 3500 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని సిట్ అంటోంది. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో సిట్ వేసిన 305 పేజీల ఛార్జ్ షీట్ లో ఈ స్కామ్ లో కీలక పాత్ర పోషించినది ఏ 1 రాజ్ కేసిరెడ్డి. అంతే కాదు ఈ డబ్బులతో ఆయన గచ్చిబౌలిలో ఒక ప్లాట్ ఆపై వివిధ ప్రాంతాల్లో 92 ఎకరాల మేర తన తల్లి, తన సంస్థ ఎషాన్ ఇన్ ఫ్రా పేరిట ఈ భూములు కొన్నట్టుగా గుర్తించారు విచారణాధికారులు. ఈ భూముల విలువ 110 కోట్ల మేర ఉంటుందంటున్నారు.ఇదిలా ఉంటే ఈ బినామీ సొమ్మును పరి పరివిధాలుగా ఖర్చు చేయడానికి రాజ్ కేసిరెడ్డి, అతడి అనుచర గణం.. ప్రయత్నంచినట్టు తెలుస్తోంది. జాంబియా, టాంజీనియా వంటి ఆఫ్రికన్ దేశాల్లో మైనింగ్ చేయడానికి గల అవకాశాలు కూడా వీరు పరిశీలించినట్టు కనిపిస్తోంది. ఈ దిశగా వీరు ఆయా దేశాలకు ట్రిప్పులు వేసినట్టు కూడా గుర్తించారు విచారణాధికారులు. యూఏఈ, యూకేల్లోనూ రకరకాల కంపెనీలు స్థాపించినట్టు గుర్తించారు. ఇందుకోసంగానూ రాజ్ కేసిరెడ్డి అండ్ కో ఏకంగా 28 సార్లు ఫారిన్ టూర్లు వేసినట్టుగా తెలుస్తోంది.ఇక ఎన్నికల్లో నగదు పంపకాల కోసం ఎంత మొత్తం వాడారని చూస్తే.. సుమారు 200 కోట్ల రూపాయల మేర.. ఈ మద్యం డబ్బులోంచి వాడినట్టు సిట్ గుర్తించింది ఇందుకోసం హైదరాబాద్, తాడేపల్లిలో కొన్ని స్థావరాలను ఏర్పాటు చేసినట్టు చెబుతున్నారు విచారణాధికారులు. ఇదంతా ఏ 38 చెవిరెడ్డి అధ్వర్యంలో నడిచినట్టు సమాచారం. ఈయన సూచనల మేరకు ఎక్కడెక్కడి నుంచి ఎంతెంత మొత్తం సొమ్ము ఎక్కడికి తరలించాలో పథక రచన చేసినట్టు చెబుతున్నారు. ఒక సారికి ఒక ట్రిప్పులో 8 నుంచి 12 కోట్ల రూపాయల మేర సొమ్ము తరలించినట్టు తెలుస్తోంది. ఇందుకు తుడా వాహనాలను సైతం వాడినట్టు గుర్తించారు.ఇలా ఎన్నికలను ప్రభావితం చేయడానికి కూడా ఈ మద్యం సొమ్ము వాడినట్టు గుర్తించింది సిట్. ఇప్పటి వరకూ అరెస్టయిన వారిలో మిథున్ రెడ్డి రెండో రాజకీయ ప్రతినిధి కాగా.. మిగిలిన వారు ఎప్పుడన్నది ఉత్కంఠగా మారింది. ఏ5 విజయసాయిరెడ్డి ఎప్పుడు అరెస్టు అవుతారన్నది సస్పెన్స్ గా మారింది. అయితే ఆయన పార్టీ నుంచి బయటకొచ్చి.. అప్రూవర్ గా మారడానికి సిద్ధంగా ఉన్నారు. అదలా ఉంటే ఆలస్యం అవుతుందేమోగానీ ఆయన అరెస్టు మాత్రం పక్కా అంటున్నారు. ఎందుకంటే విజయసాయిరెడ్డి ఇన్వాల్వ్ మెంట్ ఈ మొత్తం ఇష్యూలో రెండు మూడు ప్రధానమైన ఘట్టాల్లో ఉన్నట్టు సిట్ గుర్తించింది. మరి చూడాలి మంత్రి కొల్లు రవీంద్ర చెప్పినట్టు తర్వాతి బిగ్ వికెట్ ఎవరిదో తేలాల్సి ఉంది.

### దళిత యువకుడు సుబ్రమణ్యం హత్య కేసు

రాజమహేంద్రవరం,వైకాపా ప్రభుత్వ హయాంలో హత్యకు గురైన దళిత యువకుడు సుబ్రమణ్యం కేసులో కదలిక వచ్చింది. అప్పట్లో ఈ హత్య సంచలనం రేపింది. వైకాపా నేత అనంతబాబు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్యకు గురయ్యాడు. ఈ కేసులో తదుపరి విచారణకు రాజమహేంద్రవరంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు అనుమతి ఇచ్చింది. 90 రోజుల్లో సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2022 మే 19న కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య జరిగింది. డ్రైవర్‌ను హతమార్చిన వైకాపా నేత అనంతబాబు.. మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఘటన సంచలనం రేపిన సంగతి తెలిసిందే. హత్య తానే చేశానని అనంతబాబు అంగీకరించారని మీడియా సమావేశంలో అప్పటి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

# ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం.. చెరువులను తలపిస్తున్న రోడ్లు



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షం ముంచెత్తింది. బుధవారం ఉదయం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. దీంతో ఉదయాన్ని ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.ఢిల్లీలో మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీంతో నగరమంతా చీకటి అలుముకుంది. ఇక నిరంతరంగా వర్షం పడడంతో వేడి, అధిక కాలుష్య స్థాయిల నుంచి ఉపశమనం లభించింది. ఇండియా గేట్, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, మండి హౌస్, తుగ్లక్ రోడ్, నగరంలోని అనేక ఇతర ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. పొరుగున ఉన్న నోయిడా, ఘజియాబాద్‌లలో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి.ఇక భారీ వర్షాలతో ఢిల్లీ విమానాశ్రయం అప్రమత్తం అయింది. ప్రయాణీకులకు హెచ్చరిక జారీ చేసింది. ఢిల్లీ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు ప్రస్తుతం సాధారణంగా ఉన్నాయని తెలిపింది. ప్రయాణానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా పనిచేస్తున్నట్లు తెలిపింది. తాజా సమాచారం కోసం ప్రయాణీకులు తమ సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించింది.ఇదిలా ఉంటే ఢిల్లీకి కేంద్ర వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉరుములతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. గంటకు 5-15 మి.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఢిల్లీలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. నగర ప్రజలు ఉల్లాసంగా గడుపుతున్నారు. చల్లని గాలులతో ఉపశమనం పొందుతున్నారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**